ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




అన్నమయ్య

జిల్లా వార్తలు

5

మంగళవారం 26 నవంబరు 2024



మండపల్లెలో ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)

అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి మూడు సంవత్సరాలు దాటినా బాధితుల కష్టాలు మాత్రం తొలగిపోలేదు. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారి కష్టాలను ఎలాగూ పట్టించుకోలేదు. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందని భావించిన బాధితుల గోడు ఇప్పుడూ వినే నాథుడే కరువయ్యారు. ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు దాటుతున్నా.. స్వయంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ ప్రాంతంలో పర్యటించి బాధితులకు న్యాయం చేస్తామని ప్రకటించినా ఇంతవరకు ఆ దిశగా అడుగులే పడలేదు. ఇక మా బతుకులు ఇంతే మమ్మల్ని ఎవరూ ఆదుకోరనే నిస్సహాయ స్థితిలో బాధితులు ఆవేదన చెందుతున్నారు.



వరద ప్రాంతాల్లో నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు పర్యటన (ఫైల్)

మూడేళ్లు దాటినా..

- తీరని అన్నమయ్య ప్రాజెక్టు బాధితుల కష్టాలు
- కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు దాటుతున్నా పురోగతి లేదు
- ఉప ముఖ్యమంత్రి పర్యటించి స్పష్టమైన ఆదేశాలిచ్చినా..
- నదిలో ఏర్పాటు చేయని రక్షణ గోడలు
- బాధితులకు కల్పించని ఉపాధి అవకాశాలు
- బాధితుల గోడు వినే వారెవరు..!



బాధితుల సమస్యలు వింటున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ (ఫైల్)

రాజంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య ప్రాజెక్టు 2021 నవంబరు 19న కొట్టుకుపోయి దిగువ ప్రాంతాలన్నీ మునిగిపోయాయి. ప్రధానంగా మందపల్లె, పులపత్తూరు, రామచంద్రాపురం, తొగూరుపేట, గుండ్లూరు గ్రామాలు పూర్తిగా నీటమునిగాయి. సుమారు 41 మంది చనిపోగా వందలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. వేలాది పశువులు నీటిపాలయ్యాయి. ప్రధానంగా భారీ వరదనీరంతా గ్రామాల్లో ప్రవహించడం వల్ల గ్రామాలకు ఉన్న రక్షణగోడ తెగిపోయి ఊర్లలో నీరు ప్రవహించింది. తద్వారా ఊర్లన్నీ ఏరుగా మారిపోయాయి. అదృష్టవశాత్తు ప్రాజెక్టు తెగిపోయిన తర్వాత మూడేళ్లుగా పూర్తిగా భారీ వర్షాలు కురవకపోవడం వల్ల ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు రాలేదు. ఒకవేళ ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరదనీరు వచ్చి ఉంటే తిరిగి ఈ బాధిత గ్రామాల్లోనే ఆ నీరంతా ప్రవహించేది. తద్వారా మరోసారి బాధిత గ్రామాలు మునిగిపోయేవి. ఈ గ్రామాల్లో ప్రధాన సమస్య రక్షణ గోడ ఏర్పాటు చేయడం. గతంలో తరతరాలుగా నదీ పరివాహక ప్రాంతాల్లో ఏటినీరు గ్రామాలపై పడకుండా రక్షణ గోడలు ఏర్పాటు చేసేవారు. వీటిని గ్రామాల్లో జగతికట్టలు అని పిలుస్తారు. చెయ్యేరు నదీ పరివాహక ప్రాంతాలైన తొగూరుపేట, రామచంద్రాపురం, గుండ్లూరు, పులపత్తూరు, మందపల్లె, శేషమాంబపురం, తాళ్లపాక, నందలూరు, నాగిరెడ్డిపల్లె, ఇసుకపల్లె ఇలా 50 గ్రామాలకు జగతికట్టలు ఉండేవి. ప్రాజెక్టు తెగిపోవడం వల్ల ఒక్కసారిగా 6 లక్షల క్యూసెక్కుల నీరు గ్రామాలపై పడడంతో ఈ రక్షణ గోడలన్నీ వరదనీటిలో కొట్టుకుపోయాయి.

మూడేళ్ల దాటినా నదిలో రక్షణ గోడలు నిర్మించలేదు. గత ప్రభుత్వంలో ఈ సంఘటన జరిగినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంతాల్లో పర్యటించినా ప్రయోజనం లేకుండాపోయింది. ప్రధానంగా గ్రామాలకు ప్రధానమైన రక్షణ గోడలు వెంటనే నిర్మిస్తామని ముఖ్యమంత్రి వాగ్దానం చేసినా అనంతరం దాని గురించి పట్టించుకోలేదు. మూడు నెలల కిందట ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈ ప్రాంతాల్లో పర్యటించారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్లే ప్రాజెక్టు తెగిపోయిందని, భారీ ప్రాణ, ఆస్తినష్టం జరిగిందని పేర్కొంటూ తాము ముంపు బాధితుల హామీలన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు ఏ ఒక్క హామీ కూడా కార్యరూపం దాల్చలేదు. దుర్ఘటన జరిగినప్పుడు నాటి ప్రతిపక్షనేత, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ప్రాంతాల్లో పర్యటించి బాధితులను చూసి చలించిపోయారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ప్రాణనష్టం జరిగిన కుటుంబాలకు ఆర్థికసాయం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నమయ్య బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అయితే ఆయన ముఖ్యమంత్రి అయి ఐదు నెలలు దాటుతున్నా ఈ గ్రామాల అభివృద్ధిపై, ప్రజల బాగోగులపై బాధితులను ఆదుకోవడంపై దృష్టి సారించలేదు. ఈ సందర్భంగా పలువురు ఈ ప్రాంత నాయకులు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్వయంగా సీఎం చంద్రబాబును, మంత్రి నారా లోకేశ్‌ను, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను పదే పదే కలిసి ముంపు గ్రామాల సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండా ఉంది. ప్రధానంగా ఈ ప్రాంతంలో పరిష్కరించాల్సిన సమస్యలు ఎన్నో ఉన్నాయి.

- ప్రాజెక్టు తెగిపోయినప్పుడు నీరంతా గ్రామాలపై ప్రవహించింది. ప్రధానంగా మందపల్లెలో నీరంతా ప్రవహించడం వల్ల ఇళ్లు కొట్టుకుపోయాయి. అదేవిధంగా పులపత్తూరులో పెద్దఎత్తున ఇళ్లు కొట్టుకుపోయాయి. తొగూరుపేట, రామచంద్రాపురం, గుండ్లూరులో మొత్తం నీరు ప్రవహించింది. తక్షణం ఈ గ్రామాలతో పాటు చెయ్యేరునది పరీవాహక ప్రాంతాల్లో తాము అధికారంలోకి రాగానే కాంక్రీట్ రక్షణ గోడలను కట్టిస్తామని నాటి ప్రతిపక్షనేత, నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేర్చాలి.
- ఈ గ్రామాల్లో వందలాది ఎకరాల భూమిలో ఇసుక మేట వేసింది. వరద నీరంతా పచ్చని పంట పొలాల్లో ప్రవహించడం వల్ల నాలుగు అడుగుల మేర ఇసుకమేటలు చేరాయి. ఈ ఇసుకమేటలను తొలగించి రైతులకు వ్యవసాయ యోగ్యంగా పొలాలను తయారు చేసి ఇవ్వాలి. వరద నీటిలో వేలాది బోర్లన్నీ కొట్టుకుపోయాయి. బోరుబావులు కనిపించకుండా పోయాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లు కొట్టుకుపోయాయి. రైతులకు ఇసుకమేటలు తొలగించి వారి పొలాలు వారికి అప్పజెప్పి కొత్తగా బోర్లు వేసి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి తిరిగి ఆ భూములను వ్యవసాయ యోగ్యంగా రైతులకు అందజేయాలి.
- వరద నీటిలో సుమారు 300 ఇళ్లకు పైబడి కొట్టుకుపోగా సుమారు 3 వేల ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అయితే ఒక్క పులపత్తూరు, తొగూరుపేట మినహా మిగిలిన గ్రామాల్లో దెబ్బతిన్న భవనాలకు పరిహారంగా కొత్త ఇళ్లు ఏర్పాటు చేయలేదు. డ్యాం తెగిపోయినప్పుడు కొట్టుకుపోయిన ఇళ్ల స్థానంలో పులపత్తూరులో మూడు కాలనీలు, తొగూరుపేటలో ఒక కాలనీ కొత్తగా ఏర్పాటు చేసినా అవి ఇంతవరకు పూర్తి కాలేదు. ఆ కాలనీల్లో నీరు, కరెంటు, రోడ్లు ఇతర మౌలిక సదుపాయాలు ఇంతవరకు కల్పించలేదు. కూటమి ప్రభుత్వం వీటిపై పూర్తి స్థాయి దృష్టి సారించి ఇళ్లను పూర్తి చేసి మౌలిక వసతులు కల్పించాలి.
- వరద నీటిలో వేలాది పశువులు కొట్టుకుపోయాయి. పంటల తర్వాత పాడి ఈ ప్రాంతంలో జీవనాధార పరిశ్రమ. వేలాది బర్రెలు, ఆవులు, పొట్టేళ్లు, మేకలు, కోళ్లు నీటిపాలయ్యాయి. ఈ పరిస్థితుల్లో తిరిగి పాడి రైతులకు బ్యాంకు రుణాలు అదనంగా అందజేసి పశుసంపదపై దృష్టి పెట్టాలి. ఈ ప్రాంతంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి.
- వరద సంభవించినప్పుడు సుమారు 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రాణష్టం జరిగిన కుటుంబాల వారికి ఉద్యోగం ఇస్తామని జగన్ ప్రభుత్వం ప్రకటించినా ఆ కుటుంబాల్లో ఒకరిద్దరికి తప్ప మిగిలిన వారికి ఉద్యోగాలు ఇవ్వలేదు. ఈ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలంటే ఉద్యోగ, ఉపాధి కల్పన అవసరం. ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.
- ప్రస్తుతం ఈ గ్రామాల్లో పంట పొలాల్లో ఇసుకమేటలు వేసి పంటలు పండక, ఉపాధి అవకాశాలు లేక, ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు. అందువల్ల ఇక్కడ ఉపాధి హామీ పనులను ఎక్కువగా చేపట్టాలి. ఇసుక మేటలు తొలగించడానికి, పంటపొలాలను బాగు చేసుకోవడానికి, పంట కాలువలను పునరుద్ధరించడానికి, ఉపాధి హామీ పనులను విరివిగా కేటాయించి ఆదుకోవాలి.



జగన్ ప్రభుత్వంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు



తొగూరుపేట ప్రాంతంలో ఇంకా తొలగిపోని ఇసుకమేటలు

వరద నీరు ప్రవహించడంతో ఏరులా మారిపోయిన ఊరు



ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం సున్నా..



ఎన్ని వినతిపత్రాలు సమర్పించినా ఆ ముంపు గ్రామాలకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, మంత్రి నారా లోకేశ్‌కు అనేకసార్లు వినతిపత్రాలు సమర్పించాం. ఇంకా మాకు న్యాయం జరగలేదు. పవన్‌కళ్యాణ్ మా గ్రామాలను సందర్శించినప్పుడు మా బాధలన్నీ చెప్పుకున్నాం. ఆయన ఆదేశాల మేరకు అధికారులు తిరిగి తమకు చేయాల్సిన అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు తప్ప ఇంకా కార్యరూపం దాల్చలేదు. వెంటనే గ్రామాలకు కాంక్రీట్ రక్షణ గోడలను ఏర్పాటు చేసి ఈ గ్రామాలకు భవిష్యత్‌లో వరదనీరు రాకుండా చేయాలి. ఇతర అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలి.

- కొండా శ్రీనివాసులు, టీడీపీ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి


ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలి..



ముంపు గ్రామాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి. లేకుంటే ఈ ప్రాంత యువత ఇతర ప్రాంతాలకు వలసపోయే ప్రమాదం ఉంది. ఇక్కడ ఉపాధి అవకాశాలు మెరుగుపరిస్తే గ్రామాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ప్రధానంగా మా గ్రామాలకు ఉపాధి హామీ పనులను ఎక్కువగా చేపట్టాలి. పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి. పులపత్తూరు, మందపల్లె, తొగూరుపేట, రామచంద్రాపురం, గుండ్లూరు గ్రామాల్లో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి.

- ప్రతాప్‌రెడ్డి, పులపత్తూరు, రాజంపేట

వరద ప్రభావిత ప్రాంతాలపై వివక్ష..



గత వైసీపీ ప్రభుత్వం అసలు మమ్మల్ని ఏమాత్రం ఆదుకోలేదు. నూతన ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు దాటుతున్నా ఇంకా మాకు న్యాయం జరగలేదు. తక్షణం వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలి.

- శివరామయ్య, తొగూరుపేట, రాజంపేట

పిల్లల బాధ్యత తల్లిదండ్రులు, సంరక్షకులదే

- చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా చూసుకోవాలి
- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



రాయచోటిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పిల్లల బాధ్యత తల్లిదండ్రులు, సంరక్షకులదేనని, వారు చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత వారిదేనని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. సోమవారం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడమే కాకుండా వాహనాలను సీజ్ చేస్తామన్నారు. పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులు క్రమశిక్షణ లేకుండా ప్రవర్తించినా, ఆడపిల్లల పట్ల అనుచితంగా ప్రవర్తించినా అటువంటి ఫిర్యాదులు వస్తే వారికి టీసీలు ఇచ్చి ఇంటికి పంపేస్తామని, మరే ఇతర స్కూల్‌లో గానీ, కాలేజీలో గానీ ప్రవేశం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతటివారైనా అందరికీ ఒకే విధంగా చర్యలు ఉంటాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఏం చేస్తున్నారు, ఎటువంటి వారితో స్నేహం చేస్తున్నారు. ఎలాంటి అలవాట్లు చేసుకుంటున్నారు, దుర్వ్యసనాలకు పాల్పడుతున్నారా అనే విషయాలపై తల్లిదండ్రులకు పూర్తి స్థాయిలో స్పృహ కలిగి ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు వారి కదలికలపై దృష్టి సారిస్తూ ఉండాలని, పిల్లలకు ఫోన్‌లు ఇవ్వడం, పర్సనల్ కంప్యూటర్లు ఇవ్వడం చేయరాదన్నారు. ఒకవేళ సెల్‌ఫోన్ ఇవ్వాల్సిన పరిస్థితులు వస్తే వాటి వినియోగంపై పూర్తి నిఘా ఉంచాలని, అనధికారిక లింక్‌లు టచ్ చేయడం వలన కోరి ప్రమాదం తెచ్చుకొనే అవకాశం ఉందన్నారు. అంతేగాక పిల్లలు ధరించే దుస్తులు, హెయిర్ కటింగ్‌పై కూడా శ్రద్ధ వహించాలన్నారు. అలాగే శారీరక శ్రమ అందించే క్రీడలను ప్రోత్సహించి చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నేటి యువత మత్తుకు బానిసలుగా మారుతున్నారని, దేశాభివృద్ధిలో భాగస్వాములుగా ఉండాల్సిన యువత మత్తుకు బానిసలుగా మారిపోయి కుటుంబాలను, వారి జీవితాలను నాశనం చేసుకుని అర్థాంతరంగా ముగించుకుంటున్నారన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినా, సేవించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మీకు తెలిసి మత్తు పదార్థాలు ఇచ్చేవారు, అమ్మేవారు ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

టౌన్‌బ్యాంకు పాలకవర్గం ఏకగ్రీవ ఎన్నిక

- చైర్మన్‌గా నాదెళ్ల, వైస్‌చైర్మన్‌గా భాస్కర్‌కుమార్

మదనపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి బి.దుర్గమ్మ ప్రకటించారు. 12 మంది డైరెక్టర్లతో చైర్మన్, వైస్‌చైర్మన్‌లు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక బ్యాంకు ప్రధాన కార్యాలయంలో సోమవారం చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు ఎన్నికల అధికారి నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో చైర్మన్‌గా నాదెళ్ల విద్యాసాగర్, వైస్ చైర్మన్‌గా ఎస్.భాస్కర్‌కుమార్‌ల నుంచి ఒక్కొక్కటే నామినేషన్ దాఖలు కావడంతో వారిద్దరూ కూడా ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషాతో కలసి చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు నిమ్మనపల్లె ముక్తియార్‌ఖాన్, సూరె రవీంద్రనాథ్, రాటకొండ సోమశేఖర్, దిగువపాళెం నిరంజన్‌కుమార్, నాదెళ్ల వెంకటేశ్వరప్రసాద్, శ్రీరామ రవికాంత్‌బాబు, రామిశెట్టి భాస్కర్, ఆకుల కృష్ణమూర్తి, పఠాన్ సర్దార్‌ఖాన్, జోళపాళెం కృష్ణమూర్తి దేవేంద్రబాబులకు డిక్లరేషన్ అందజేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి చేయడంతో ఎన్నికల అధికారి బి.దుర్గమ్మ, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు శ్యామ్‌ప్రకాష్‌రెడ్డి, ఎ.ప్రవీణ్‌కుమార్, దీప, సిబ్బందిని బ్యాంకు సీఈవో పి.వి.ప్రసాద్, ఉద్యోగులు, డైరెక్టర్లు సన్మానించారు.



చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్‌కు డిక్లరేషన్ ఫారం అందజేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ఎన్నికల అధికారి దుర్గమ్మ

మల్లయ్య దర్శనం.. సకల పాపహరణం

- భక్తులతో కిటకిటలాడిన మల్లయ్యకొండ

తంబళ్లపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ భక్తులతో కిటకిటలాడింది. నాలుగో కార్తీక సోమవారం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం వేలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. సోమవారం వేకువజాము నుంచే భక్తులు మల్లయ్యకొండకు చేరుకుని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. అర్చకులు ఈశ్వరప్ప స్వామివారిని వెండి నాగాభరణంతో అలంకరించి దూపదీప నైవేద్యాలతో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కొండపైన కల్యాణ కట్ట వద్ద మహిళలు భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర గౌరీవ్రత నోములు నోచుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. కొండపైన భక్తులకు తంబళ్లపల్లెకు చెందిన ఎస్.రాజారెడ్డి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండ పైకి రెండు ఆర్టీసీ బస్సులను నడిపారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు



భక్తులతో కిటకిటలాడుతున్న మల్లయ్యకొండ ఆలయం

పశు సంవర్ధక శాఖ ఉద్యోగికి గోపాల్‌రత్న అవార్డు

- నేడు ఢిల్లీలో అవార్డు ప్రదానం



అనిల్‌కుమార్

రాయచోటి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశు సంవర్ధకశాఖలో పనిచేస్తున్న అనిల్‌కుమార్ ప్రతిష్ఠాత్మక గోపాల్‌రత్న అవార్డుకు ఎంపికయ్యారు. అవార్డు గ్రహీతకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పాల ఉత్పత్తిని పెంచడంలో ప్రత్యేకంగా కృషి చేసినందుకు గోపాల్‌రత్న అవార్డు లభించిందన్నారు. పశు సంర్ధకశాఖ జిల్లా అధికారి గుణశేఖర్‌పిళ్లై మాట్లాడుతూ మదనపల్లి డివిజన్‌లో జూనియర్ వెటర్నరీ అధికారిగా పనిచేస్తున్న అనిల్‌కుమార్ జాతీయ స్థాయిలో ఆర్టిఫిషియల్ టెక్నీషియన్ విభాగంలో గోపాల్‌రత్న అవార్డుకు ఎంపిక కావడం అత్యంత గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డును ఆయన ఈనెల 26వ తేదీ జాతీయ పాల దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ చేతుల మీదుగా అందుకోనున్నారని తెలిపారు.

జీవనోపాధుల కల్పనే లక్ష్యం

- సాంప్రదాయక ఆహార ఉత్పత్తులకు ఊతం
- జిల్లా పేరుతో ఆహార పదార్థాలకు బ్రాండింగ్
- వినూత్న ప్రయత్నం
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

6



అంగళ్లులో భూవివాదం

- అనంతపురం, తిరుపతి వాసుల తిష్ట
- జాతీయ రహదారిపై బాధితుల ఆందోళన
- పోలీసుల రంగప్రవేశం.. నిందితులు పరార్

కురబలకోట/మదనపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కురబలకోట మండలం అంగళ్లులో మరోసారి భూవివాదం నెలకొంది. ఇదే భూమిలో మూడేళ్ల క్రితం పులివెందుల ముఠా తిష్ట వేసి భూమి ఆక్రమణకు యత్నించింది. అదే తరహాలో సోమవారం అనంతపురం, తిరుపతికి చెందిన ఇద్దరు నేతల ఆధ్వర్యంలో వారి అనుచరులు పాగా వేశారు. మదనపల్లె-అనంతపురం జాతీయ రహదారి పక్కన అంగళ్లు సర్వే నెంబర్-220 లో మొత్తం 69.42 ఎకరాలు ఉంది. ఇందులో ఆ సర్వే నెంబరు-220-4లోని 7.66 ఎకరాలకు సంబంధించి వివాదం నడుస్తోంది. ఈ వివాదాస్పదమైన భూమిలో సోమవారం టెంటు వేసుకుని భూమి చదునుతో పాటు సిమెంటు దిమ్మెలు నాటి కంచె నిర్మాణ పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న బాధితులు అక్కడ పనులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే అనంతపురం, తిరుపతి నుంచి వచ్చిన నేతల అనుచరులు బాధితులను అడ్డుకున్నట్లు చెబుతున్నారు. అక్కడ ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు కురబలకోట, మదనపల్లె రూరల్ పోలీసులను ఆశ్రయించినా మాకు న్యాయం జరగలేదని, గతంలో మాదిరిగానే దౌర్జన్యం చేస్తూ పనులు చేస్తున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అటుగా వెళుతున్న ఓ వ్యక్తి ఫొటోలు, వీడియో తీస్తుండగా అక్కడ పహారా సిబ్బంది ఫోన్ లాక్కుని, ఆయనపై దాడి చేసి పంపారు. బాధితుల్లో కొందరు సోమవారం రూరల్ సీఐ, డీఎస్పీని ఆశ్రయిస్తే వారిని పిలిపించి మాట్లాడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అయితే వివాదాస్పద భూమిలో పనులు చేస్తుండగా పోలీసులు, అధికారులు పట్టించుకోకపోవడంతో బాధితులు మదనపల్లె-అనంతపురం జాతీయ రహదారిపై బైఠాయించారు. అంతవరకు అటువైపు చూడని పోలీసులు బాధితులు మధ్యాహ్నం ఆందోళన చేస్తున్నారని సమాచారం అందడంతో రంగప్రవేశం చేశారు. మా ఫిర్యాదులను పట్టించుకోని రెవెన్యూ, పోలీసులు బయట వ్యక్తులు అక్రమంగా వచ్చి వివాదాస్పద భూమిలో పనులు చేస్తుంటే ఎలా సహకరిస్తారని మహిళలు మండిపడ్డారు. మాకు న్యాయం జరిగేంతవరకు ఆందోళన విరమించేదిలేదని తేల్చి చెప్పడంతో పోలీసులు వెంటనే వివాదాస్పద భూమిలో వేసిన టెంటును తొలగించేశారు. ఈక్రమంలో అక్కడ కాపలాగా ఉన్న వ్యక్తులు వాహనాల్లో పరారయ్యారు. అక్కడ పనులు ఆపేయడం, పనిచేస్తున్న ఎక్స్‌వేటర్‌ను పంపేయడంతో బాధితులు ఆందోళన విరమించారు. నిత్యం వివాదాలకు నిలయమైన ఆ స్థలంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇరువర్గాల ప్రవేశంతో ఉద్రిక్తత నెలకొంది. అయిదేళ్ల వైసీపీ పాలనలో అంగళ్లు భూవివాదాలు, కబ్జాలకు నిలయంగా ఉండగా, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి అయిదునెలలు అవుతున్నా..ఇలాంటి సంఘటనలు పునరావృతం కావడంపై స్థానికులు పోలీసులు, రెవెన్యూ అధికారులపై పెదవి విరుస్తున్నారు.



వివాదాస్పద భూమిలో చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్



జాతీయ రహదారిపై బైఠాయించిన బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

జీవనోపాధుల కల్పనే లక్ష్యం



- సాంప్రదాయక ఆహార ఉత్పత్తులకు ఊతం
- జిల్లా పేరుతో ఆహార పదార్థాలకు బ్రాండింగ్
- వినూత్న ప్రయత్నం
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనలో భాగంగా మెరుగైన జీవనోపాధులు కల్పించి మహిళల్లో ఆర్థిక సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి నేతృత్వంలో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో స్థానికంగా పేరొందిన సాంప్రదాయ ఆహార ఉత్పత్తులకు ఊతమిచ్చే విధంగా బ్రాండింగ్, మార్కెటింగ్ చేయాలని కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. ఈ మేరకు ఏపీ స్టేట్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, డీఆర్‌డీఏ, మెప్మా, హార్టికల్చర్, ఏపీఎంఐపీ అధికారులతో సాంప్రదాయ ఆహార ఉత్పత్తులపై ఇప్పటికే సమావేశమై ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వహణపై ఆరా తీశారు. అధికార యంత్రాంగం ఆలోచన మేరకు వీరి ప్రయ త్నం సఫలీకృతమైతే జిల్లాలో స్థానికంగా లభ్యమయ్యే సాంప్రదాయక ఆహార ఉత్పత్తుల తయారీదారులతో పాటు రైతులకు సైతం ఆదాయం చేకూరే అవకాశం లేకపోలేదు. జిల్లాలో ప్రాధాన్యత ఉన్న స్వీట్స్, కారాలు , మిల్లెట్, ఊరగాయలు, పొడర్లు, స్పైసెస్ వంటి ఆహార ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ తీసుకువచ్చేందుకు కోర్ టీం అధికారులు ప్రయత్నం మొదలుపెట్టారు.

మహిళా సంఘాలకు ప్రయోజనం

పొదుపుతో మొదలైన మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం వివిధ రుణాలు మంజూరు చేస్తూ జీవనోపాదుల కల్పన చేపట్టింది. ఈ క్రమంలో జిల్లాలో ఇప్పటికే ఆహార ఉత్పత్తి కూడా కొనసాగుతోంది. అయితే సరైన మార్కెటింగ్ లేకపోవడంతో ఆశించినంత స్థాయిలో లాభాలు గడించలేకపోతున్నారు. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అనేక మార్పులు తీసుకువచ్చి మెరుగైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆహార ఉత్పత్తిదారుల తయారీలను బయట ప్రపంచానికి తెలిసేలా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల సభ్యులు తయారు చేసే కడప అరెశలు, పోరుమామిళ్ల ఊరగాయలు, చాపాడు, ఖాజీపేట, మైదుకూరు పసు పు, రాజుపాలెం, జమ్మలమడుగు మండలాల్లో తయారు చేసే పాలకోవా, ప్రొద్దుటూరులో తయారవుతున్న తంగేడుపల్లె స్వీట్, పులివెందుల, వేముల మిల్లెట్స్ వంటి ఆహార పదార్థాల ప్రమాణాలు, నాణ్యతలను ముందుగా అధికారులు పరిశీలించి ఎలా తయారు చేస్తున్నారు. ఎలా ప్రాసెసింగ్ చేస్తున్నారు, ప్యాకింగ్ ఏ విధంగా చేస్తున్నారు వంటి అంశాలను అధ్యయనం చేయనున్నారు. ప్రధానంగా జిల్లా పేరు గుర్తుకు రాగానే ఇవి కడప జిల్లాకు చెందిన ఆహార ఉత్పత్తులుగా గుర్తించడానికి ప్యాకింగ్, క్వాలిటీ, బ్రాండింగ్ రిజిస్ట్రేషన్ అన్నీ పక్కాగా ఉండాలనే విధంగా తగు చర్యలు తీసుకోనున్నారు.

జిల్లా ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు

సాంప్రదాయక చరిత్ర కలిగిన జిల్లా వంటకాలకు, ప్రాచుర్యం ఉన్న మాధవరం చీరలు వంటి వాటికి దశల వారీగా భౌగోళిక గుర్తింపు తీసుకురావాలనే ప్రయత్నంలో అధికార యంత్రాంగం సమాయత్తమవుతోం ది. ఆహార ఉత్పత్తులకు ప్రత్యేక బ్రాండింగ్, మార్కెటింగ్ చేసి వాటి తయారీపై ఆధారపడిన వారికి మెరుగైన జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు. సాంప్రదాయక ఆహార ఉత్పత్తులు నాణ్యత ఉన్నప్పటికీ ప్రోత్సాహం లేకపోవడంతో తగిన గుర్తింపు నోచుకోలేకపోతున్నాయి. ఈ క్రమంలో సాంప్రదాయ ఆహార ఉత్పత్తులకు మంచి బ్రాండింగ్, పేరు తీసుకువచ్చే దిశగా కార్యాచరణ సిద్ధం అవుతోంది. ప్రైమ్ మినిస్టర్ ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) కింద ఆహార ఉత్పత్తులకు ప్రోత్సా హం అందించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో చేపడుతున్న తయారీల్లో మరింత నాణ్యత తీసుకువచ్చేందుకు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునే విధంగా అవసరమైన తోడ్పాటు, వృత్తి నైపుణ్యంతో కూడిన నూతన సాంకేతిక పద్ధతులపై సెల్ఫ్ హెల్ప్‌గ్రూపు సంఘాలకు శిక్షణ కూడా ఇవ్వనున్నారు. ప్యాకింగ్, డిజైనింగ్, మార్కెటింగ్, బ్రాండింగ్‌తో పాటు రవాణా నిల్వ ఖర్చులు, అడ్వర్టైజ్‌మెంట్ లాంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రణాళికలు రూపొందించనున్నారు.

కార్పొరేట్ ఉత్పత్తుల తరహాలో మార్కెటింగ్



కార్పొరేట్ రంగ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తరహాలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల విక్రయాలు చేపట్టేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సూచనల మేరకు చర్యలు తీసుకుంటున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పొదుపు సంఘాల్లోని మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం, మరింత మెరుగైన జీవనోపాదుల కల్పన కోసం అనేక పథకాలు అమలయ్యే పరిస్థితి ఉంది.

- వై.సురేశ్‌రెడ్డి. మెప్మా పీడీ


చెగోడీలు తయారు చేస్తున్న లీలావతి


బిస్కట్లు తయారు చేస్తున్న సుభద్ర


పాలకోవా తయారీలో వెంకటసుబ్బమ్మ

ప్రజల సమస్యలకు అత్యంత ప్రాధాన్యం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తోందని తెలిపారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను వందశాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యలను పట్టుకుని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యలను సావధానంగా వినాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ఎస్‌డీసీ రామసుబ్బయ్య, ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్టపరిధిలో న్యాయం చేస్తాం : ఎస్పీ


బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

రాయచోటిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను స్పష్టంగా తెలుసుకుని వాటిని చట్టపరిధిలో విచారించి న్యాయం చేయడానికి జిల్లా పోలీసు శాఖ సిద్ధంగా ఉంటుందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

వికలాంగులు, వృద్ధులు, మహిళల నుంచి వచ్చే ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. అంతేగాక సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది సహాయం చేశారు. సమస్య తీవ్రత ఎలా ఉన్నా చట్ట పరిధిలో పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిర్ణీత గడువులోపల పరిష్కారం అందించడానికి కృషి చేస్తా మని ఎస్పీ బాధితులకు భరోసా ఇచ్చారు.

రూ.6.50 లక్షలతో డైనింగ్ హాల్ నిర్మాణం

- పూర్వ విద్యార్థి ఔదార్యం


శ్రీనివాసులునాయుడు, ఆయన తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పీలేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేవీ పల్లె మండలం తిమ్మాపురం పంచాయతీ చిన్నకమ్మపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి శ్రీనివాసులునాయుడు రూ.6.50 లక్షలు వెచ్చించి విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసేందుకు అనువైన డైనింగ్ హాల్‌ను నిర్మించి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. ఈ ఉన్నత పాఠశాలలో చదివిన గాలివారిపల్లెకు చెందిన శ్రీనివాసులునాయుడు అమెరికాలోని డల్లాస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా స్థిరపడ్డారు. రెండు నెలల క్రితం తాను విద్యనభ్యసించిన పాఠశాలను సందర్శించాడు.

పాఠశాలలోని అపరిశుభ్రంగా ఉన్న పలుచోట్ల విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడాన్ని గమనించి తానే స్వయంగా విద్యార్థులకు ఒక డైనింగ్ హాల్ నిర్మించి ఇవ్వాలని నిర్ణయించుకుని పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులతో చర్చించాడు. అనంతరం విద్యాశాఖ ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని నిర్మాణాన్ని ప్రారంభించి స్వల్ప కాలంలోనే పూర్తి చేశాడు. సోమవారం ఈ డైనింగ్ హాల్‌ను తల్లిదండ్రులు రెడ్డెమ్మ, గాలి గోవిందునాయుడు, పెదనాన్న గంగయ్యల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుని అమెరికాలో ఉన్నత స్థానంలో స్థిరపడ్డానని చెప్పారు. చెన్నైలోని 'సెలబ్రేషన్ ఆఫ్ లైఫ్' అనే స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా క్యాన్సర్ బాధితులుగా ఉన్న 120 మంది పిల్లలకు కావలసిన పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు.

చెన్నైలోనే ఒక వృద్ధాశ్రమంలో వున్న 60 మంది వయో వృద్ధుల బాగోగులు చూసుకుంటున్నట్లు చెప్పారు. ఇవన్నీ సంస్కారవంతమైన విద్య ద్వారానే అలవడినట్లు స్పష్టం చేశారు. చదువుకోవలసిన సమయంలో చదువును అభ్యసిస్తేనే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని చెప్పారు. శ్రీనివాసులునాయుడును హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర నెట్‌బాల్ విజేత విశాఖపట్నం


విశాఖపట్నం బాలికలకు ట్రోఫీ అందచేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అండర్-17 రాష్ట్ర స్కూల్స్ గేమ్స్ నెట్ బాల్ బాలికల జట్టు విజేతగా విశాఖపట్నం జట్టు నిలిచింది. సీటీఎం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ పోటీలు సోమవారంతో ముగిశాయని అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంత తెలిపారు. కాగా పోటీల్లో ద్వితీయస్థానంలో పశ్చిమగోదావరి, తృతీయ స్థానంలో కృష్ణా జిల్లా జట్లు నిలిచాయన్నారు. విజేతలైన జట్లకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ప్రతి ఒక్కరూ విజేతలే అన్నారు. మదనపల్లె క్రీడాకారులకు పుట్టినిల్లు అని, వాతావరణం కూడా క్రీడాకారులకు అనుకూలించిందన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన బాలికలు డిసెంబరులో పంజాబ్‌లో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు : హిందూజా, వెంకటరేష్మా (పశ్చిమ గోదావరి), జాగారపు ప్రణతి, రిషిత (విశాఖపట్నం), సుప్రియ (కృష్ణా), సాత్విక (కడప), హస్విక (అనంతపురం), కళ్యాణిరేవతి (తూర్పుగోదావరి), బీష్మా, వర్షి (చిత్తూరు), భానుప్రియ (గుంటూరు).

స్టాండ్ బైలుగా : చంద్రకళ (చిత్తూరు), శిరీషా (విశాఖపట్నం), పోషిత (పశ్చిమగోదావరి), పూజిత (కృష్ణా), సింధూరి (కడప) ఎంపికయ్యారని అబ్జర్వర్ రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం అంజనేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు నాగరాజు, నరేష్‌బాబు, పూర్ణిమ, గ్రామ కమిటీ వేమన్న, పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు కారు ఢీకొని ఒకరికి గాయాలు

నందలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దారు ప్రయాణిస్తున్న కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వేకోడూరు తహసీల్దారు మహబూబ్‌చాంద్ సోమవారం ఉదయం కడప నుంచి కోడూరుకు వెళుతుండగా ఆమె ప్రయాణిస్తున్న కారు స్థానిక కన్యకాచెరువుకట్ట వద్ద బైక్‌పై రోడ్డు దాటుతున్న చెన్నయ్యగారిపల్లెకు చెందిన నరసింహులును ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింహులు రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రుడిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళల ముంగిటకే రక్షణ వ్యవస్థ

జిల్లాలో తొలి జీఆర్‌సీ ప్రారంభం : ఎమ్మెల్యే : షాజహాన్‌బాషా


జీఆర్‌సీని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గృహహింస, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు తదితర సామాజిక సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ముంగిటకే రక్షణ వ్యవస్థ తీసుకొచ్చాయని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన జెండర్ రీసోర్సు సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వర్చువల్‌గా ఈ సెంటర్లను ప్రారంభించిందన్నారు. మన రాష్ట్రంలో కేవలం 12 సెంటర్లు మాత్రమే మంజూరు కాగా అందులో మదనపల్లెలో జీఆర్‌సీ సెంటర్‌ను మోడల్ సెంటర్‌గా ఏర్పాటు చేయడం ఇక్కడి మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సామాజిక సమస్యలపై మహిళలు ఇకపై పోలీసుస్టేషన్ వెళ్లాల్సిన అవసరం లేదని, ప్రతి గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు జీఆర్‌సీలో అధికారులు ఉంటారని, మహిళల సామాజిక సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. బీపీఎం లక్ష్మీప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఎంపీడీవో, ఏపీఎం, సీడీపీవోతో పాటు మహిళా సమాఖ్య లీడర్లు, సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులు ఇక్కడ ఉంటారన్నారు. జీఆర్‌సీలను మహిళలు సద్వినియోగం చేసుకునేలా సంఘమిత్రలు ఎస్‌హెచ్‌జీ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సుబ్రమణ్యం, ఖిజర్ అహ్మద్, ఎంఎస్ లీడర్లు సావిత్రి, సునీత, మల్లీశ్వరి, సంఘమిత్రలు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

రాజంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా దాచి ఉంచిన 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు సబ్‌కంట్రోల్ ఆర్‌ఐ కృపానంద తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆయన సోమవారం ఒక ప్రెస్‌నోట్ విడుదల చేశారు. రాజంపేట సెక్షన్‌లోని పించా డ్యాం వద్ద ఆర్‌ఎస్‌ఐపీ రాఘవేంద్ర సిబ్బందితో కలసి కూంబింగ్ నిర్వహిస్తుండగా ఆరోగ్యపురం సమీపంలో చెయ్యేరు వద్ద కొందరు వ్యక్తులు కనిపించగా పోలీసులను చూసి వారు పారిపోతుండగా ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతను అన్నమయ్య జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించామని, అతడు ఇచ్చిన సమాచారం మేరకు సమీపంలో దాచి ఉంచిన 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసుస్టేషన్‌కు తరలించగా ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

జలపాతం.. సందడే.. సందడి...

మండలంలోని మాధవరం పోడుకు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుంజన జలపాతం వద్ద సోమవారం సందర్శకులతో సందడిగా మారింది. కార్తీక సోమవారం సందర్భంగా సమీప గ్రామాలకు చెందిన ప్రజలు అక్కడికి చేరుకుని అక్కడే వన భోజనాలు చేశారు. జలపాతం వద్ద ఈత కొడుతూ ఉల్లాసంగా గడిపారు.

- రైల్వేకోడూరు (ఆంధ్రజ్యోతి)


నీటిలో సరదాగా...


గుంజన జలపాతం వద్ద కార్తీక వన భోజనానికి వంటలు తయారు చేస్తున్న దృశ్యం


గుంజన జలపాతం

సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు రావాలి : సంజయ్ దోబ్లే


మాట్లాడుతున్న డాక్టర్ సంజయ్ దోబ్లే

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమాజానికి ఉపయోగకరమైన పరిశోధనలు రావాలని ఆ దిశగా పరిశోధకులు కృషి చేయాలని నాగ్‌పూర్ యూనివర్శిటీ భౌతిక శాస్త్ర ప్రొఫెసరు డాక్టర్ సంజయ్ దోబ్లే తెలిపారు. సోమవారం కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాలలో భౌతికశాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సింథసిస్ ఆఫ్ అడ్వాన్స్ మెటీరియల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ దోబ్లే మాట్లాడుతూ పరిశోధన ఫలాలను అవసరమైన మేరకు ఉపయోగించుకోవాలని, అతిగా ఉపయోగించుకుంటే అనర్థాలు ఉత్పన్నమవుతాయన్నారు. వైవీయూ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ సైన్స్‌అండ్ టెక్నాలజీ కోసం అడ్వాన్స్ మెటీరియల్ సంశ్లేషణపై జాతీయకాన్ఫరెన్స్‌లో ప్రసంగిస్తూ ఇంజనీరింగ్, పర్యావరణ స్థిరత్వంలో మార్గదర్శక పరిష్కారాల వరకు ఇది మెరుగైందని, మరింత స్థిరమైన భవిష్యత్తు కోసం ఆకాంక్షించాలన్నారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్, సదస్సు కన్వీనరు డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ప్రొఫెసరు చంద్రఓబులరెడ్డి, బయపురెడ్డి, డాక్టర్ నాగేశ్వర్‌రాజు, డాక్టర్ భూషణ్ రెడ్డిలు ప్రసంగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు స్కూటర్లు ఢీ - ఒకరి పరిస్థితి విషమం


గుర్తుతెలియని వ్యక్తి

జమ్మలమడుగు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ప్రొద్దుటూరు రోడ్డులో సోమవారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు, మరొకరికి స్వల్పగాయాలైన సంఘటన చోటు చేసుకుంది. వివరాలిలా.. ప్రొద్దుటూరు నుంచి ఏపీ21బీడీ8612 నంబరుగల ద్విచక్ర వాహనంలో గుర్తు తెలియని వ్యక్తి జమ్మలమడుగు వైపునకు వస్తున్నాడు. కాగా జమ్మలమడుగు పట్టణం కుండావారి వీధికి చెందిన రామాంజనేయులు ఎక్స్‌ఎల్ వాహనంలో ఎదురుగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎక్సెల్ వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తి ఢీకొనడంతో అతనికి తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానిక క్యాంబెల్ ఆస్పత్రికి తరలించారు. ఈయన వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. కాగా రామాంజనేయులుకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

7 ట్రాక్టర్లు, ఎక్సకవేటర్ సీజ్


తహసీల్దారు కార్యాలయంలో సీజ్‌చేసిన ట్రాక్టర్లు, ఎక్సకవేటర్

బద్వేలుటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని బయనపల్లె చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న 7 ట్రాక్టర్లను, ఒక ఎక్సవేటర్‌ను తహసీల్దార్ ఉదయభాస్కరరాజు సీజ్ చేశారు. గత కొద్ది రోజులుగా మట్టిమాఫియా రెచ్చిపోయి చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తవ్వి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సోమవారం తహసీల్దార్ తన సిబ్బందితో బయనపల్లె చెరువును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించే సమయంలో ఒక ఎక్సవేటర్‌ను, 7 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బస్సులో నుంచి దూకి యువతికి తీవ్రగాయాలు


గాయాలపాలైన శ్రీలత

చక్రాయపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రన్నింగ్ బస్సులో నుంచి దూకి యువతికి తీవ్రగాయాలైన సంఘటన చక్రాయపేటలో చోటు చేసుకుంది. పులివెందుల పట్టణం రోటరీపురం ప్రాంతానికి చెందిన సులోచన, ఆమె కుమార్తె శ్రీలత రాయచోటి నుంచి పులివెందులకు సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్సులో వస్తున్నారు. చక్రాయపేట సమీపంలోకి రాగానే శ్రీలత బస్సులో నుంచి దూకేసింది. కుమార్తె దూకడంతో వెంటనే తల్లి సులోచన కూడా దూకింది. ఈ ఘటనలో శ్రీలతకు తీవ్రగాయాలై ముక్కు, చెవులు, నోటి నుంచి రక్తస్రావమై స్పృహ కోల్పోయింది. హుటాహుటిన వేంపల్లెకు తరలించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. తల్లీ, కుమార్తెలు ఇరువురు బస్సు ఫుట్‌పాత్ డోర్‌కు ఎదురుగా ఉన్న సీటులో కూర్చున్నారు. ఉన్నపలంగా దూకడంతో ప్రయాణికులు ఒకింత భయాందోళనకు గురయ్యారు. అయితే ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వారసత్వ సంపదకు నిలయం కడప జిల్లా


నృత్యం చేసిన చిన్నారులతో ఇంటాక్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా భారత దేశ స్థాయిలో ఘనమైన వారసత్వ సంపదకు నిలయంగా ఉందని ఇంటాక్ సభ్యులు మంజులారెడ్డి, సంజీవరెడ్డి అన్నారు. సోమవారం కడప నగరం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటాక్ ఆధ్వర్యంలో వారసత్వ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు నృత్యం చిత్రకళ, యోగా చేనేతలు తదితర అంశాలతో పాటు వారసత్వ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటాక్ కన్వీనరు లయన్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ కేవలం శాస్త్రీయ జానపద నృత్యాలతో కార్యక్రమాన్ని ప్రసంగాలు లేకుండా ఏర్పాటు చేయడం విశేషమన్నారు. భరతనాట్యం, కూచిపూడి, అన్నమయ్య కీర్తనలు, కోలాటం, కర్రసాము, జానపద నృత్యాలు తదితర సాంప్రదాయ నృత్యాలు కళారూపాల ప్రదర్శనతో వారోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామన్నారు. నృత్యం చేసిన చిన్నారులకు లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకటసుబ్బయ్య కొండూరు జనార్థన రాజు, కొండారెడ్డి, గంగాధర్, గౌరీశంకర్, నాగవేణి తదితరులు బహుమతులు అందజేశారు.

అవినీతికి కేరాఫ్..!



- రిజిస్ట్రేషన్‌కు ఓ రేటు నిర్ణయించి పైసా వసూల్
- ప్రతి పనీ రైటర్ల కనుసన్నల్లోనే
- ఇదీ.. బద్వేలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం దుస్థితి

బద్వేలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఖజానాకు ఆదాయం తీసుకువచ్చే శాఖలలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ప్రధానమైనది. ఈ శాఖలో అవినీతి రాజ్యమేలుతోంది. కొంతమంది అధికారులు తాము ఇంతే.. తమ తీరు ఇంతే అన్నకోవలో సాగుతున్నారు. ప్రతి రిజిస్ట్రేషన్‌కు ఒక రేటు నిర్ణయించి పైసా వసూలు చేస్తున్నారు. ఇక్కడ డాక్యుమెంటు రైటర్లు చెప్పిందే వేదమన్నట్లుగా అవినీతి దందా సాగుతోంది. డాక్యుమెంటు రైటర్లతో అధికారులు ఒప్పందం కుదుర్చుకుని స్థిర, చరాస్తులు రిజిష్టర్ చేయించుకునేందుకు వచ్చేవారిని జలగల్లా పీక్కుతింటున్నారు. ఈ కార్యాలయంలో జరుగుతున్న అవినీతికి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.


బద్వేలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

బద్వేలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతి నిలయంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో పలుమార్లు ఏసీబీ అధికారులు దాడులు చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కొంతమంది అధికారులపై చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ అధికారుల్లో ఎలాంటి మార్పురాలేదని ప్రజల్లో గుసగుసలు వినవస్తున్నాయి. ప్రతి రిజిస్ట్రేషన్‌కు ఓ రేటు నిర్ణయించి పైసా వసూల్‌కు పాల్పడుతున్నా ఈ అవినీతికి అడ్డుకట్ట వేయలేక పోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం ద్వారా లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటూ ముడుపులు ఇస్తేగాని, రిజిష్టర్లు చేయని దుర్మార్గపు పరిస్థితి కనిపిస్తోంది. ఈ కార్యాలయంలో డాక్యుమెంటు రైటర్లు, కార్యాలయంలో పనిచేసే సిబ్బంది కనుసన్నల్లోనే సాగుతూ వస్తోంది. ఇక్కడ అవినీతి అధికారులకు అనేక ఫిర్యాదులు అందుతున్నట్లు సమాచారం. అందిన కాడికి వసూలు చేసుకోవడం ఇక్కడి అధికారుల వంతు అయిపోయిందని చెబుతున్నారు. అవినీతిలో మునిగి తేలుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు పేర్కొంటున్నారు. కార్యాలయంలో లంచం ఇవ్వనిదే ఏ పని జరగడం లేదన్న ఆరోపణలు బలంగా వినవస్తున్నాయి. ఇక్కడ డాక్యుమెంటు రైటర్లదే ఇష్టారాజ్యం, వారు చెప్పిందే వేదం, వారు అడిగినంత డబ్బులు ఇస్తేనే సాఫీగా రిజిస్ట్రేషన్ జరుగుతుంది. లేకుంటే రిజిష్టర్లు ఆపేస్తున్నారన్నట్లు తెలుస్తోంది. ఇక్కడ రైటర్లందరూ ఒక్కటిగా ఏర్పడి తమ దందాను కొనసాగిస్తున్నారు. ఏ పనికి ఎంతరేటో ముందుగానే చెప్పేస్తూ అందులో ఎవరి వాటా ఎంత అని నిర్ణయించి మరీ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇది బద్వేలు నియోజకవర్గ ప్రజలకు శాపంగా మారింది.

ఆరోపణలలో వాస్తవం లేదు

- విద్యాసాగర్‌రెడ్డి, సబ్ రిజిస్ట్రార్, బద్వేలు

ఆరోపణలలో వాస్తవం లేదు. ఎవరైనా లంచాలు అడిగినట్లు తమ దృష్టికి తెస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఫీజు చెల్లించి రశీదు చెల్లిస్తే రిజిష్టర్ చేస్తాం. నేను ఇటీవలే వచ్చాను. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల ప్రకారమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లు నా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం.

భారీ తేడాతో రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ విజయం

- 79 పరుగుల తేడాతో ప్రకాశం
- 4 వికెట్ల తేడాతో ఈస్ట్ గోదావరి జట్ల విజయాలు

కడప స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్- 23 మెన్స్ ఇంటర్ జోనల్ వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా సోమవారం వేర్వేరు జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. ఈ మ్యాచ్‌లలో రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టు 117 పరుగుల తేడాతో సెంట్రల్ జట్టుపై గెలుపొందగా, మరో మ్యాచ్‌లో ప్రకాశం జట్టు 79 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టుపై విజయం సాధించింది. అనంతపురం జట్టుపై ఈస్ట్ గోదావరి జట్టు 4 వికెట్ల తేడాతో గెలుపొందింది.

కేఓఆర్‌ఎం మైదానంలో

నగర కేఓఆర్‌ఎం మైదానంలో రెస్ట్ ఆఫ్ సెంట్రల్- రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో.. తొలుత టాస్ నెగ్గిన రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 323 పరుగులు చేసింది. ఇందులో సుబ్రమణ్యం (బ్యాటర్) 129 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. కాగా మరో బ్యాటర్ ధరణికుమార్‌నాయుడు 59 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్ జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 206 పరుగులకు కుప్పకూలింది. ఇందులో స్వామినాయుడు (బ్యాటర్) సరిగ్గా 100 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. బౌలింగ్ విభాగంలో ధరణికుమార్‌నాయుడు 5 వికెట్లు సాధించారు. దీంతో 117 పరుగుల భారీ తేడాతో రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టు విజయం సాధించింది.

ఏసీఏ క్రికెట్ మైదానంలో

నగర రిమ్స్ సమీప వై.ఎస్.రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్- ప్రకాశం జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 345 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో రోహిత్ (బ్యాటర్) 119 పరుగులు చేయగా మరో బ్యాట్స్‌మెన్ అభినవ్ 75 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు 48.5 ఓవర్లలో 266 పరుగులకే ఆలౌట్ అయింది. ఇందులో హిమకర్ (బ్యాటర్) 64 పరుగులు చేయగా మరో బ్యాటర్ రవికిరణ్ 65 పరుగులు చేశారు. దీంతో ప్రకాశం జట్టు 79 పరుగుల తేడాతో గెలుపు సాధించింది.


100 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన స్వామినాయుడు (రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్)

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో

నగర శివారు ప్రాంత కెఎస్‌ఆర్‌ఎం మైదానంలో ఈస్ట్ గోదావరి- అనంతపురం జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత టాస్‌నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 268 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు 47.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 271 పరుగులు మాత్రమే చేసింది. ఇందులో టి.వి.సాయిశ్రావణ్ 93 పరుగులు చేశారు. దీంతో ఈస్ట్ గోదావరి జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

ఓబీసీ కులగణన వెంటనే చేపట్టాలి


- బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు

కడప మారుతీనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యావత్ భారత దేశంలో జనగణనతో పాటుగా ఓబీసీ కులగణన త్వరగా పాలక ప్రభుత్వాలు చేపట్టాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఓబీసీ కులగణన చేట్టిన తర్వాతనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడాలని తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పాలక ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారన్నారు. ఆ మేరకు బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కమిటీ పిలుపు దృష్ట్యా సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్, ఉపాధ్యక్షుడు కళ్యాసుధాకర్ మాట్లాడారు. మన దేశానికి స్వాతంత్ర్యం రాకముందు 1931 సంవత్సరంలో మన దేశంలో గల అన్ని కులాల జనాభా వివరాలతో పాటుగా జీవన స్థితిగతులను సేకరించారన్నారు. తదుపరి ఇంతవరకూ జరిగిన ఏ జనగణనలోనూ, సమగ్ర కులగణన జరపక పోవడం విడ్డూరంగా వుందన్నారు. స్వతంత్ర భారతంలో 77 సంవత్సరాల తర్వాత కూడా అణగారిన వెనుకబడిన తరగతులైన ఓబీసీల జనగణన, కులాలవారిగా వివరాలను శాస్త్రీయంగా సేకరించకపోవడం బాధాకరమన్నారు. మనదేశంలో సుమారు 6,743 కులాలున్నాయని, అందులో 3,964 ఓబీసీ కులాలతో విభజితమై వుందన్నారు. కాగా మొత్తం జనాభాలో 52 శాతంగా వున్న ఓబీసీలకు రాజకీయ, ఆర్థిక, వాణిజ్య, విద్య, ఉద్యోగ, ఉపాధి, రంగాలలో మాత్రం వీరి వాటా 12 నుంచి 21 శాతానికి మించి లేవని పలు సర్వేలు చెబుతున్నాయన్నారు. ఆధిపత్య కుల ప్రాధాన్యత కలిగిన హర్యానా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలలో ఓబీసీ పార్లమెంట్ సభ్యులు ఏనాడు 12 నుంచి 30 శాతానికి మించడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి త్వరితగతిన ఓబీసీ కులగణన కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడు సీఆర్ఐ సునీల్ జయంత్, నాయకులు ఖాదర్‌బాష, మహిళా నాయకురాలు జయశ్రీతో పాటు పలువురు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు

వంద పుస్తకాలు బహూకరణ



బ్రౌన్ గ్రంథాలయానికి సమర్పించిన పుస్తకాలు

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి చెందిన విశ్రాంత జియాలజిస్టు జి.వెంకట్రామిరెడ్డి వంద పుస్తకాలను సోమవారం సీపీబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో గ్రంథాలయ సహాయకుడు ఎన్.రమేశ్‌రావుకు అందించారు. ఈ సందర్భంగా సంచాలకురాలు ప్రొఫెసరు పార్వతి మాట్లాడుతూ వెంకట్రామిరెడ్డి బహూకరించిన అమూల్యమైన గ్రంథాల్లో గాలిబ్ గీతాలు, సింహాచల వైభవం, మా పసలపూడి కథలు, భట్టిప్రోలు కథలు, తెలుగుకథ ఇలా అనేక గ్రంథాలున్నాయన్నారు. కాగా వెంకట్రామిరెడ్డిని వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ హర్షం వ్యక్తం చేశారు.

మట్కారామయ్య అరెస్టు

- రూ.50,130 నగదు, చీటీలు స్వాధీనం

కడప క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎర్రముక్కపల్లెలో మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు అమర్‌నాథరెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు ఎర్రముక్కపల్లెకు చెందిన రామయ్య అలియాస్ మట్కారామయ్య మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. సీఐ రామక్రిష్ణ అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.50130 నగదు, మట్కాచీటీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

గోపవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీకాంత్ సోమవారం తెలిపారు. స్థానిక రూరల్ పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎటువంటి అనుమతులు లేకుండా పెద్దపోలు పల్లెకుంట తనిఖీ కేంద్రం నుంచి ఇసుకను తరలిస్తుండగా టిప్పరును స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేశామని, ఇసుక తరలింపుపై పోలీసుల నిఘా ఉందన్నారు. అదేవిధంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

ఎయిడ్స్ పట్ల అవగాహన ఉండాలి

కడప ఎన్జీఆర్‌సర్కిల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్షేత్రస్థాయిలో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని జిల్లా కుష్టు, క్షయ, ఎయిడ్స్ అధికారి డాక్టర్ రవిబాబు పేర్కొన్నారు. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ఎన్జీవోలు, సీబీవోలు, సభ్యులతో సమావేశం నిర్వహించారు.

గంగనపల్లె విద్యార్థుల ప్రతిభ

పెండ్లిమర్రి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో మండలంలోని గంగనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి దేవి తెలిపారు. వక్తృత్వ పోటీలలో ప్రథమస్థానంలో హాజీరా నిలిచిందన్నారు. రాజ్యాంగంపై డిబేట్ నందు భవితరెడ్డి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు.

జీఎన్‌ఎస్‌ఎస్-1 ఈఈ గా ఉమామహేశ్వర్లు


ఈఈగా బాధ్యతలు చేపడుతున్న ఉమామహేశ్వర్లు

కొండాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గాలేరు నగరి సుజల స్రవంతి (జీఎన్‌ఎస్‌ఎస్-1) ఈఈ(ఎఫ్ఏసీ)గా ఉమామహేశ్వర్లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం జీఎన్‌ఎస్‌ఎస్ డీఈగా ఉన్న ఆయనకు ప్రమోషన్ రావడంతో ఎస్ఈగా కడప జీఎన్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు పనిచేసిన ఈఈ శ్రీనివాసులు సీఈగా ప్రమోషన్ పొందారు. కాగా గండికోట ప్రాజెక్టుతో పాటు పలు రిజర్వాయర్లు జీఎన్‌ఎస్‌ఎస్-1 పరిధిలోకి వస్తాయి.

బొలెరో వాహనాన్ని ఢీకొన్న లారీ

- డ్రైవరుకు గాయాలు


రోడ్డుపై పడి ఉన్న కోడిగుడ్లు

పులివెందులటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణం కడప రోడ్డులోని మెడికల్ కళాశాల సమీపంలో కోడిగుడ్ల బొలెరో వాహనాన్ని రేషన్ బియ్యం లారీ ఆదివారం రాత్రి ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలెరో డ్రైవరు ప్రసాద్ తలకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. కడప నుంచి పులివెందులకు కోడిగుడ్ల బొలెరో వాహనం వస్తోంది. ఈ మేరకు ఎదురుగా వచ్చిన రేషన్ బియ్యం లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం, లారీల ముందు భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బొలెరో వాహనం డ్రైవరు ప్రసాద్‌కు కూడా గాయాలవడంతో చికిత్స నిమిత్తం దగ్గరలో ఉన్న వైఎస్‌ఆర్ సర్వజన ఆసుపత్రికి తరలించారు. సోమవారం ఉదయం ఈ విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లింగ వివక్షపై అవగాహన

ఓబులవారిపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం లింగ వివక్షపై వీవోఏలకు ఎంఎస్‌ఓబీలకు అవగాహన కల్పించినట్లు ఎంపీడీవో మల్‌రెడ్డి తెలిపారు. అనంతరం గ్రామవీధుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జెండర్ సమస్యలు గుర్తించడం, లైంగిక వేధింపులపై అవగాహన, బాలికల విద్య, బాల్య వివాహాలు, గృహ హింసపై గ్రామ సమాఖ్య పదాధికారులు, జెండర్ కమిటీలు, వీవోఏలు పనిచేయాలని తెలిపారు. అగ్రికల్చర్ అధికారి మల్లిక, ఏపీఎం మల్లికార్జునరాజు, వైడీపీఎం ఏపీఎండీ డి.రామచంద్ర, పీసీలు హరిబాబు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు

మంచం పట్టిన అడవి కమ్మపల్లె

● ఇంటింటా జ్వర పీడితులు ● పిచ్చిమొక్కల మధ్య తాగునీటి బోరు ● గ్రామంలో కనిపించని వైద్య సిబ్బంది

సంబేపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలం అడవి కమ్మపల్లెలో కీళ్ల జ్వరాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. ఇంటింటా జ్వరపీడితులే. మంచానికి పరిమిత మయ్యాయి. ఏ ఒక్కరినీ పలకరించినా ఇదేదో మాయదారి జ్వరంగా ఉందంటున్నారు. కీళ్ల వాపులు, నడవలేని పరిస్థితి, కాళ్లు, మొహం వాపులు రావడంతో 10, 15 రోజులు అవుతున్నా కోలుకోలేని పరిస్థితిలో ఉన్నామంటున్నారు స్థానిక ప్రజలు. ఆ ఊరిలో సుమారు 20 మంది దాకా జ్వరాల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సరోజమ్మ, ఎల్లమ్మ, రామలక్ష్మమ్మ వీరితో పాటు భావన, మోక్షిత్, దీక్షిత్ మరికొంత మంది తెలిపారు. గృహాల చుట్టూ, తాగునీటి బోరు వద్ద పిచ్చి మొక్కలు పెరిగిపోయాయని, గ్రామంలో పారిశుధ్య చర్యలు ఎవరూ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా వైద్య సిబ్బంది గ్రామంలో కనిపించడం లేదని తెలిపారు.



జ్వరంతో మంచాన పడిన వృద్ధురాలు

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

రాయచోటి టౌన్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే బాధితుల సమస్యలను విని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. సమస్యలు పరిష్కరించినప్పుడే ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుందని, ప్రతి అధికారి ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాగా, మంత్రిని కడప మైనర్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్ రావు మర్యాద పూర్వకంగా కలిశారు.

చిన్నమండెం: మండలంలోని వండాడి గ్రా మ పంచాయతీలోని యండపల్లి లక్ష్మీదేవమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వండాడి గ్రామానికి వెళ్లి ఆమె మృతదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

రైల్వేకోడూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోషల్ మీడియా అబ్యూజ్ అండ్ సైబర్ బుల్లీయింగ్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కంప్యూటర్ సైన్సు అధ్యాపకుడు జి. దయానందం, వైస్ ప్రిన్సిపాల్ జి. రమేష్, కళాశాల కంప్యూటర్ అప్లికేషన్స్ అధ్యాపకురాలు జి. సౌజన్య తదితరులు మాట్లాడారు.

ఉత్తమ విద్యార్థులకు బహుమతుల పంపిణీ

రైల్వేకోడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాములపాటి వెంకటసుబ్బానాయుడు జ్ఞాపకార్థం సామాజిక సేవా కార్యకర్త పాములపాటి సుబ్బరాయుడు సోమవారం నగదు బహుమతులు పంపిణీ చేశారు. ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్ హెచ్ఈసీ గ్రూపు లో 930 మార్కులు సాధించిన ఎస్. యాస్మిన్‌కు రూ. 10,000లు, బైపీసీ గ్రూపులో 864 మార్కులు సాధించిన కే. అపర్ణ కు రూ. 10,000లు నగదు పంపిణీ చేశారు. కుప్పసాని ధర్మారెడ్డి జ్ఞాపకార్థం కుప్పసాని విజయ్‌కుమార్‌రెడ్డి ఒక్కొక్కరికి రూ. 11,000లు నగదును పంపిణీ చేశారు. మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కే. ప్రసాద్ కళాశాలలో ఫస్ట్ మార్కులు సాధించిన ఇంటర్ విద్యార్థిని ఎస్. యాస్మిన్‌కు రూ. 2000లు నగదును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై. నరసింహమూర్తి, అధ్యాపకులు ఏ. రాజేశ్వరి, శారద, డి. లీలావతి, లైబ్రేరియన్ కే. ప్రసాద్‌వర్మ, వి. రంగనాయకులు, ఎస్. మస్తాన్‌సాహెబ్, పి. కృష్ణయ్య, బి. ఈశ్వరనరేంద్ర, విద్యార్థిని, విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పన ప్రభుత్వ లక్ష్యం

వీరబల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు అన్నారు. సోమవారం మట్లి పంచాయతీ తొగటపల్లిలో రూ. 19.9 లక్షలు, గుర్రప్ప గారి పల్లె పంచాయతీలోని వంగిపురం హరిజనవాడ, అచ్చిరాజుగారిపల్లె, వడ్డెపల్లి, గుర్రప్పగారిపల్లె గ్రామాల్లో రూ 15 లక్షలతో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులకు పంచాయతీరాజ్ ఏఈ నాగూర్‌మీరా ఇతర అధికారులతో కలిసి ఆయన భూమిపూజ చేశారు.

నందలూరు : మండలంలోని పాటూరు, ఆడపూరు, నీలిపల్లె గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దెపల్లె ప్రతాప్‌రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి పసుపులేటి ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ఆర్టీసీ జోనల్ మాజీ ఛైర్మన్ యెద్దల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న జగన్‌మోహన్‌రాజు

పని భారం తగ్గించాలని వీఆర్వోల వినతి

సిద్దవటం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పనిభారం తగ్గించాలంటూ మండలంలోని వీఆర్వోలు సోమవారం తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు కేశవులు మాట్లాడుతూ సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో వీఆర్వోలను భాగస్వాములను చేశారని, నీటిసంఘం ఓటరు జాబితా తయారీ, తదితర విధుల కారణంగా కులం, ఆదాయ సర్టిఫికెట్లను సకాలంలో అందించలేక పోతున్నామని వాపోయారు. రెవెన్యూకు సంబంధించిన పనులు మాత్రమే తమకు అప్పగించాలని కోరారు.

గాలివీడు: వీఆర్ఏలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నామని ఆ సంఘం అధ్యక్షుడు భోగేశ్వరయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలో వీఆర్ఏల సంఘం ఎన్నికలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా భోగేశ్వరయ్య, కార్యదర్శిగా సిద్దేశ్వరయ్య, ట్రెజరర్‌గా చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు.

హౌసింగ్ పీడీపై విచారణ చేయాలి

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాయచోటి గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పల్లపు సాంబశివ అవినీతి అక్రమాలపై ఈ నెల 4న ఫిర్యాదు చేస్తే ఇంతవరకు విచారణ లేదని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ అన్నమయ్య జిల్లా నాయకులు మావులూరి విశ్వనాథ్ ఆరోపించారు. ఈ విషయంపై సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 రోజుల క్రితం హౌసింగ్ పీడీ శివయ్య అక్రమాలపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తే ఇంతవరకు చర్యలు లేవని కలెక్టర్‌కు వివరించారు. ఒక జిల్లా అధికారిపై ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి లవకుమార్, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

రాజుల కాలనీకి వెలిగల్లు నీరివ్వాలి

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు25(ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీ పక్కన ఉన్న చెన్నముక్కపల్లెలోని రాజుల కాలనీకి వెలిగల్లు ప్రాజెక్టు పైపు లైను ద్వారా తాగునీరు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చి సుమిత్ర మాట్లాడుతూ మూడేళ్లుగా ఫిర్యాదు చేస్తున్నా ఎవరూ స్పందించ లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

తపాలా భవనానికి భూమి పూజ

ఓబులవారిపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గాదెల గ్రామ పంచాయతీలో పోస్టల్ డిపార్టుమెంట్‌కు సంబంధించిన భవన నిర్మాణానికి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఎస్పీఎం శ్రీనివాసులు, బ్రాంచ్ పోస్టుమాస్టర్‌లు ఉమామహేశ్వర్‌రెడ్డి, షేక్ వాహబ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ మాజీ సభ్యులు నాయుడోరి రమణ, నరసింహులు, సర్పంచ్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి

రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరుపేదలకు ఇంటి స్థలాల మంజూరుతో పాటు ఇళ్లు కట్టించేవరకు పోరాటం ఆగదని బీకేఎంయూ నాయకుడు ఎం.జయరామయ్య సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి తహసీల్దార్ మహబూబ్ చాంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు కటారి గోపాల్, అరుణ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నందలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు వలంటీర్ల అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోం నిధియా దేవికి వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులుఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, బకాయిలు కూడా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలి

ఒంటిమిట్ట నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలంటూ మండలంలోని పెన్నపేరూరు గ్రామస్థులతో కలిసి స్థానిక టీడీపీ నాయకులు ఆందోళన చేశారు. 2013లో పెన్నపేరూరు గ్రామానికి దాదాపు 150 మందికి పైగా ప్రభుత్వం కేటాయించిన భూముల హద్దులను ఇప్పటికీ రెవెన్యూ అధికారులు చూపలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆ భూములన్నీ ఆక్రమణకు గురయ్యాయన్నారు. ఈ విషయంలో పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు..

100 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం

సుండుపల్లె, నవంబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ పెద్దబిడికి సమీపంలో సోమవారం 100 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిఆరు. నాటుసారా తయారు చేసిన అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హెడ్ కానిస్టేబుల్ బీడీ నాయక్, కానిస్టేబుల్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి శుద్ధి కేంద్రం ప్రారంభం

సిద్దవటం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టక్కోలి అరుంధతివాడలో రూ.3 లక్షల రూపాయల 15వ ఆర్థికసంఘం నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫయర్ ప్లాంటును నియోజక వర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రతిపక్ష హోదాలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానం అమలుచేశామన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి నాగమునిరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బమ్మ, చెంచయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె: ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. సోమవారం తిమ్మసముద్రం శివాలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం

అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ

రాజంపేట టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అన్నమాచార్య యూనివర్సిటీకి చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు ఇసుకపల్లె రోడ్డు సిద్దేశ్వరకాలనీ అనాథాశ్రమంలోని పిల్లలకు సోమవారం పండ్లు, సబ్బులు, పేస్టు, బ్రష్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగముని మాట్లాడుతూ ఎన్‌సీసీ డే సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కళాశాల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, కళాశాల వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్ రెడ్డి అభినందించారు. కళాశాల రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు, సీటీవో ఎన్.దీప్తి, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ ఎస్.సైపుల్లా, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ నేత టీడీపీలో చేరిక



నరసింహారెడ్డిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

పెనగలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు బీఎల్ నరసింహారెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరడం శుభపరిణామమని ఆడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. సోమవారం ఇండ్లూరులోని తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో కండువా కప్పి నరసింహారెడ్డిని టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇండ్లూరు, కొత్త సింగనమల, సిద్దవరం గ్రామాలకు చెందిన దాదాపు 100 కుటుంబాలు టీడీపీలో చేరాయి. డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులరెడ్డి గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముక్కా వరలక్ష్మి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, లేబాక రెడ్డి పాలిరెడ్డి పాల్గొన్నారు.

నిత్యపూజ ఆలయ హుండీ లెక్కింపు

సిద్దవటం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిత్యపూజ స్వామి ఆలయ హుండీ లోని కానుకలను సోమవారం రాత్రి లెక్కించారు. హుండీ ద్వారా రూ.1,25,365 ఆదాయం వచ్చిందని ఎండోమెంట్ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ జి.మల్లికార్జున ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధుల కల్పనే లక్ష్యం



- సాంప్రదాయక ఆహార ఉత్పత్తులకు ఊతం
- జిల్లా పేరుతో ఆహార పదార్థాలకు బ్రాండింగ్
- వినూత్న ప్రయత్నం
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

కడప ఎన్జీఆర్ సర్కిల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనలో భాగంగా మెరుగైన జీవనోపాధులు కల్పించి మహిళల్లో ఆర్థిక సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి నేతృత్వంలో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో స్థానికంగా పేరొందిన సాంప్రదాయ ఆహార ఉత్పత్తులకు ఊతమిచ్చే విధంగా బ్రాండింగ్, మార్కెటింగ్ చేయాలని కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. ఈ మేరకు ఏపీ స్టేట్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, డీఆర్డీఏ, మెప్మా, హార్టికల్చర్, ఏపీఎంఐపీ అధికారులతో సాంప్రదాయ ఆహార ఉత్పత్తులపై ఇప్పటికే సమావేశమై ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వహణపై ఆరా తీశారు. అధికార యంత్రాంగం ఆలోచన మేరకు వీరి ప్రయ త్నం సఫలీకృతమైతే జిల్లాలో స్థానికంగా లభ్యమయ్యే సాంప్రదాయక ఆహార ఉత్పత్తుల తయారీదారులతో పాటు రైతులకు సైతం ఆదాయం చేకూరే అవకాశం లేకపోలేదు. జిల్లాలో ప్రాధాన్యత ఉన్న స్వీట్స్, కారాలు , మిల్లెట్, ఊరగాయలు, పొడర్లు, స్పైసెస్ వంటి ఆహార ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ తీసుకువచ్చేందుకు కోర్ టీం అధికారులు ప్రయత్నం మొదలుపెట్టారు.

మహిళా సంఘాలకు ప్రయోజనం

పొదుపుతో మొదలైన మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం వివిధ రుణాలు మంజూరు చేస్తూ జీవనోపాధుల కల్పన చేపట్టింది. ఈ క్రమంలో జిల్లాలో ఇప్పటికే ఆహార ఉత్పత్తి కూడా కొనసాగుతోంది. అయితే సరైన మార్కెటింగ్ లేకపోవడంతో ఆశించినంత స్థాయిలో లాభాలు గడించలేకపోతున్నారు. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అనేక మార్పులు తీసుకువచ్చి మెరుగైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆహార ఉత్పత్తిదారుల తయారీలను బయ ట ప్రపంచానికి తెలిసేలా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల సభ్యులు తయారు చేసే కడప అరెశలు, పోరుమామిళ్ల ఊరగాయలు, చాపాడు, ఖాజీపేట, మైదుకూరు పసు పు, రాజుపాలెం, జమ్మలమడుగు మండలాల్లో తయారు చేసే పాలకోవా, ప్రొద్దుటూరులో తయారవుతున్న తంగేడుపల్లె స్వీట్, పులివెందుల, వేముల మిల్లెట్స్ వంటి ఆహార పదార్థాల ప్రమాణాలు, నాణ్యతలను ముందుగా అధికారులు పరిశీలించి ఎలా తయారు చేస్తున్నారు. ఎలా ప్రాసెసింగ్ చేస్తున్నారు, ప్యాకింగ్ ఏ విధంగా చేస్తున్నారు వంటి అంశాలను అధ్యయనం చేయనున్నారు. ప్రధానంగా జిల్లా పేరు గుర్తుకు రాగానే ఇవి కడప జిల్లాకు చెందిన ఆహార ఉత్పత్తులుగా గుర్తించడానికి ప్యాకింగ్, క్వాలిటీ, బ్రాండింగ్ రిజిస్ట్రేషన్ అన్నీ పక్కాగా ఉండాలనే విధంగా తగు చర్యలు తీసుకోనున్నారు.

కార్పొరేట్ ఉత్పత్తుల తరహాలో మార్కెటింగ్



కార్పొరేట్ రంగ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తరహాలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల విక్రయాలు చేపట్టేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సూచనల మేరకు చర్యలు తీసుకుంటున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పొదుపు సంఘాల్లోని మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం, మరింత మెరుగైన జీవనోపాధుల కల్పన కోసం అనేక పథకాలు అమలయ్యే పరిస్థితి ఉంది.

- వై.సురేశ్‌రెడ్డి. మెప్మా పీడీ

జిల్లా ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు

సాంప్రదాయక చరిత్ర కలిగిన జిల్లా వంటకాలకు, ప్రాచుర్యం ఉన్న మాధవరం చీరలు వంటి వాటికి దశల వారీగా భౌగోళిక గుర్తింపు తీసుకురావాలనే ప్రయత్నంలో అధికార యంత్రాంగం సమాయత్తమవుతోం ది. ఆహార ఉత్పత్తులకు ప్రత్యేక బ్రాండింగ్, మార్కెటింగ్ చేసి వాటి తయారీపై ఆధారపడిన వారికి మెరుగైన జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు. సాంప్రదాయక ఆహార ఉత్పత్తులు నాణ్యత ఉన్నప్పటికీ ప్రోత్సాహం లేకపోవడంతో తగిన గుర్తింపు నోచుకోలేకపోతున్నాయి. ఈ క్రమంలో సాంప్రదాయ ఆహార ఉత్పత్తులకు మంచి బ్రాండింగ్, పేరు తీసుకువచ్చే దిశగా కార్యాచరణ సిద్ధం అవుతోంది. ప్రైమ్ మినిస్టర్ ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) కింద ఆహార ఉత్పత్తులకు ప్రోత్సా హం అందించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో చేపడుతున్న తయారీల్లో మరింత నాణ్యత తీసుకువచ్చేందుకు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునే విధంగా అవసరమైన తోడ్పాటు, వృత్తి నైపుణ్యంతో కూడిన నూతన సాంకేతిక పద్ధతులపై సెల్ఫ్ హెల్ప్‌గ్రూపు సంఘాలకు శిక్షణ కూడా ఇవ్వనున్నారు. ప్యాకింగ్, డిజైనింగ్, మార్కెటింగ్, బ్రాండింగ్‌తో పాటు రవాణా నిల్వ ఖర్చులు, అడ్వర్టైజ్‌మెంట్ లాంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రణాళికలు రూపొందించనున్నారు.



చెగోడీలు తయారు చేస్తున్న లీలావతి



బిస్కట్లు తయారు చేస్తున్న సుభద్ర



పాలకోవా తయారీలో వెంకటసుబ్బమ్మ

ప్రజల సమస్యలకు అత్యంత ప్రాధాన్యం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తోందని తెలిపారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను వందశాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యలను పట్టుకుని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యలను సావధానంగా వినాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ఎస్‌డీసీ రామసుబ్బయ్య, ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్టపరిధిలో న్యాయం చేస్తాం : ఎస్పీ



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

రాయచోటిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను స్పష్టంగా తెలుసుకుని వాటిని చట్టపరిధిలో విచారించి న్యాయం చేయడానికి జిల్లా పోలీసు శాఖ సిద్ధంగా ఉంటుందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

వికలాంగులు, వృద్ధులు, మహిళల నుంచి వచ్చే ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. అంతేగాక సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది సహాయం చేశారు. సమస్య తీవ్రత ఎలా ఉన్నా చట్ట పరిధిలో పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిర్దీత గడువులోపల పరిష్కారం అందించడానికి కృషి చేస్తా మని ఎస్పీ బాధితులకు భరోసా ఇచ్చారు.

రూ.6.50 లక్షలతో డైనింగ్ హాల్ నిర్మాణం

- పూర్వ విద్యార్థి ఔదార్యం



శ్రీనివాసులునాయుడు, ఆయన తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పీలేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేవీ పల్లె మండలం తిమ్మాపురం పంచాయతీ చిన్నకమ్మపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి శ్రీనివాసులునాయుడు రూ.6.50 లక్షలు వెచ్చించి విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసేందుకు అనువైన డైనింగ్ హాల్‌ను నిర్మించి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. ఈ ఉన్నత పాఠశాలలో చదివిన గాలివారిపల్లెకు చెందిన శ్రీనివాసులునాయుడు అమెరికాలోని డల్లాస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా స్థిరపడ్డారు. రెండు నెలల క్రితం తాను విద్యనభ్యసించిన పాఠశాలను సందర్శించాడు.

పాఠశాలలోని అపరిశుభ్రంగా ఉన్న పలుచోట్ల విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడాన్ని గమనించి తానే స్వయంగా విద్యార్థులకు ఒక డైనింగ్ హాల్ నిర్మించి ఇవ్వాలని నిర్ణయించుకుని పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులతో చర్చించాడు. అనంతరం విద్యాశాఖ ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని నిర్మాణానాన్ని ప్రారంభించి స్వల్ప కాలంలోనే పూర్తి చేశాడు. సోమవారం ఈ డైనింగ్ హాల్‌ను తల్లిదండ్రులు రెడ్డెమ్మ, గాలి గోవిందునాయుడు, పెదనాన్న గంగయ్యల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుని అమెరికాలో ఉన్నత స్థానంలో స్థిరపడ్డానని చెప్పారు. చెన్నైలోని 'సెలబ్రేషన్ ఆఫ్ లైఫ్' అనే స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా క్యాన్సర్ బాధితులుగా ఉన్న 120 మంది పిల్లలకు కావలసిన పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు.

చెన్నైలోనే ఒక వృద్ధాశ్రమంలో వున్న 60 మంది వయో వృద్ధుల బాగోగులు చూసుకుంటున్నట్లు చెప్పారు. ఇవన్నీ సంస్కారవంతమైన విద్య ద్వారానే అలవడినట్లు స్పష్టం చేశారు. చదువుకోవలసిన సమయంలో చదువును అభ్యసిస్తేనే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని చెప్పారు. శ్రీనివాసులునాయుడును హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర నెట్‌బాల్ విజేత విశాఖపట్నం



విశాఖపట్నం బాలికలకు ట్రోఫీ అందచేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అండర్-17 రాష్ట్ర స్కూల్స్ గేమ్స్ నెట్ బాల్ బాలికల జట్టు విజేతగా విశాఖపట్నం జట్టు నిలిచింది. సీటీఎం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ పోటీలు సోమవారంతో ముగిశాయని అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంత తెలిపారు. కాగా పోటీల్లో ద్వితీయస్థానంలో పశ్చిమగోదావరి, తృతీయ స్థానంలో కృష్ణా జిల్లా జట్లు నిలిచాయన్నారు. విజేతలైన జట్లకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ప్రతి ఒక్కరూ విజేతలే అన్నారు. మదనపల్లె క్రీడాకారులకు పుట్టినిల్లు అని, వాతావరణం కూడా క్రీడాకారులకు అనుకూలించిందన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన బాలికలు డిసెంబరులో పంజాబ్‌లో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు : హిందూజా, వెంకటరేష్మా (పశ్చిమ గోదావరి), జాగారపు ప్రణతి, రిషిత (విశాఖపట్నం), సుప్రియ (కృష్ణా), సాత్విక (కడప), హస్విక (అనంతపురం), కళ్యాణిరేవతి (తూర్పుగోదావరి), బీష్మా, వర్షి (చిత్తూరు), భానుప్రియ (గుంటూరు).

స్టాండ్ బైలుగా : చంద్రకళ (చిత్తూరు), శిరీషా (విశాఖపట్నం), పోషిత (పశ్చిమగోదావరి), పూజిత (కృష్ణా), సింధూరి (కడప) ఎంపికయ్యారని అబ్జర్వర్ రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆంజనేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు నాగరాజు, నరేష్‌బాబు, పూర్ణిమ, గ్రామ కమిటీ వేమన్న, పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు కారు ఢీకొని ఒకరికి గాయాలు

నందలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దారు ప్రయాణిస్తున్న కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వేకోడూరు తహసీల్దారు మహబూబ్‌చాంద్ సోమవారం ఉదయం కడప నుంచి కోడూరుకు వెళుతుండగా ఆమె ప్రయాణిస్తున్న కారు స్థానిక కన్యకాచెరువుకట్ట వద్ద బైక్‌పై రోడ్డు దాటుతున్న చెన్నయ్యగారిపల్లెకు చెందిన నరసింహులును ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింహులు రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రుడిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళల ముంగిటకే రక్షణ వ్యవస్థ

జిల్లాలో తొలి జీఆర్‌సీ ప్రారంభం : ఎమ్మెల్యే : షాజహాన్‌బాషా



జీఆర్‌సీని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గృహహింస, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు తదితర సామాజిక సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ముంగిటకే రక్షణ వ్యవస్థ తీసుకొచ్చాయని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన జెండర్ రీసోర్సు సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వర్చువల్‌గా ఈ సెంటర్లను ప్రారంభించిందన్నారు. మన రాష్ట్రంలో కేవలం 12 సెంటర్లు మాత్రమే మంజూరు కాగా అందులో మదనపల్లెలో జీఆర్‌సీ సెంటర్‌ను మోడల్ సెంటర్‌గా ఏర్పాటు చేయడం ఇక్కడి మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సామాజిక సమస్యలపై మహిళలు ఇకపై పోలీసుస్టేషన్ వెళ్లాల్సిన అవసరం లేదని, ప్రతి గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు జీఆర్‌సీలో అధికారులు ఉంటారని, మహిళల సామాజిక సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. బీపీఎం లక్ష్మీప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఎంపీడీవో, ఏపీఎం, సీడీపీవోతో పాటు మహిళా సమాఖ్య లీడర్లు, సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులు ఇక్కడ ఉంటారన్నారు. జీఆర్‌సీలను మహిళలు సద్వినియోగం చేసుకునేలా సంఘమిత్రలు ఎస్‌హెచ్‌జీ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సుబ్రమణ్యం, ఖిజర్ అహ్మద్, ఎంఎస్ లీడర్లు సావిత్రి, సునీత, మల్లీశ్వరి, సంఘమిత్రలు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

రాజంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా దాచి ఉంచిన 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు సబ్‌కంట్రోల్ ఆర్ఐ కృపానంద తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆయన సోమవారం ఒక ప్రెస్‌నోట్ విడుదల చేశారు. రాజంపేట సెక్షన్‌లోని పించా డ్యాం వద్ద ఆర్ఎస్ఐపీ రాఘవేంద్ర సిబ్బందితో కలసి కూంబింగ్ నిర్వహిస్తుండగా ఆరోగ్యపురం సమీపంలో చెయ్యేరు వద్ద కొందరు వ్యక్తులు కనిపించగా పోలీసులను చూసి వారు పారిపోతుండగా ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతను అన్నమయ్య జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించామని, అతడు ఇచ్చిన సమాచారం మేరకు సమీపంలో దాచి ఉంచిన 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసుస్టేషన్‌కు తరలించగా ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

జలపాతం.. సందడే.. సందడి...

మండలంలోని మాధవరం పోడుకు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుంజన జలపాతం వద్ద సోమవారం సందర్శకులతో సందడిగా మారింది. కార్తీక సోమవారం సందర్భంగా సమీప గ్రామాలకు చెందిన ప్రజలు అక్కడికి చేరుకుని అక్కడే వన భోజనాలు చేశారు. జలపాతం వద్ద ఈత కొడుతూ ఉల్లాసంగా గడిపారు.

- రైల్వేకోడూరు (ఆంధ్రజ్యోతి)



నీటిలో సరదాగా...



గుంజన జలపాతం వద్ద కార్తీక వన భోజనానికి వంటలు తయారు చేస్తున్న దృశ్యం



గుంజన జలపాతం

సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు రావాలి : సంజయ్ దోబ్లే


మాట్లాడుతున్న డాక్టర్ సంజయ్ దోబ్లే

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమాజానికి ఉపయోగకరమైన పరిశోధనలు రావాలని ఆ దిశగా పరిశోధకులు కృషి చేయాలని నాగ్‌పూర్ యూనివర్శిటీ భౌతిక శాస్త్ర ప్రొఫెసరు డాక్టర్ సంజయ్ దోబ్లే తెలిపారు. సోమవారం కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాలలో భౌతికశాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సింథసిస్ ఆఫ్ అడ్వాన్స్ మెటీరియల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ దోబ్లే మాట్లాడుతూ పరిశోధన ఫలాలను అవసరమైన మేరకు ఉపయోగించుకోవాలని, అతిగా ఉపయోగించుకుంటే అనర్థాలు ఉత్పన్నమవుతాయన్నారు. వైవీయూ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ సైన్స్‌అండ్ టెక్నాలజీ కోసం అడ్వాన్స్ మెటీరియల్ సంశ్లేషణపై జాతీయకాన్ఫరెన్స్‌లో ప్రసంగిస్తూ ఇంజనీరింగ్, పర్యావరణ స్థిరత్వంలో మార్గదర్శక పరిష్కారాల వరకు ఇది మెరుగైందని, మరింత స్థిరమైన భవిష్యత్తు కోసం ఆకాంక్షించాలన్నారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్, సదస్సు కన్వీనరు డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ప్రొఫెసరు చంద్రఓబులరెడ్డి, బయపురెడ్డి, డాక్టర్ నాగేశ్వర్‌రాజు, డాక్టర్ భూషణ్ రెడ్డిలు ప్రసంగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు స్కూటర్లు ఢీ - ఒకరి పరిస్థితి విషమం


గుర్తుతెలియని వ్యక్తి

జమ్మలమడుగు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ప్రొద్దుటూరు రోడ్డులో సోమవారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు, మరొకరికి స్వల్పగాయాలైన సంఘటన చోటు చేసుకుంది. వివరాలిలా.. ప్రొద్దుటూరు నుంచి ఏపీ21బీడీ8612 నంబరుగల ద్విచక్ర వాహనంలో గుర్తు తెలియని వ్యక్తి జమ్మలమడుగు వైపునకు వస్తున్నాడు. కాగా జమ్మలమడుగు పట్టణం కుండావారి వీధికి చెందిన రామాంజనేయులు ఎక్స్‌ఎల్ వాహనంలో ఎదురుగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎక్సెల్ వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తి ఢీకొనడంతో అతనికి తీవ్రగాయాలై అపస్మారక స్థితి లోకి వెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానిక క్యాంబెల్ ఆస్పత్రికి తరలించారు. ఈయన వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. కాగా రామాంజనేయులుకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

7 ట్రాక్టర్లు, ఎక్సకవేటర్ సీజ్


తహసీల్దారు కార్యాలయంలో సీజ్‌చేసిన ట్రాక్టర్లు, ఎక్సకవేటర్

బద్వేలుటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని బయనపల్లె చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న 7 ట్రాక్టర్లను, ఒక ఎక్సవేటర్‌ను తహసీల్దార్ ఉదయభాస్కరరాజు సీజ్ చేశారు. గత కొద్ది రోజులుగా మట్టిమాఫియా రెచ్చిపోయి చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తవ్వి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సోమవారం తహసీల్దార్ తన సిబ్బందితో బయనపల్లె చెరువును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించే సమయంలో ఒక ఎక్సవేటర్‌ను, 7 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బస్సులో నుంచి దూకి యువతికి తీవ్రగాయాలు


గాయాలపాలైన శ్రీలత

చక్రాయపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రన్నింగ్ బస్సులో నుంచి దూకి యువతికి తీవ్రగాయాలైన సంఘటన చక్రాయపేటలో చోటు చేసుకుంది. పులివెందుల పట్టణం రోటరీపురం ప్రాంతానికి చెందిన సులోచన, ఆమె కుమార్తె శ్రీలత రాయచోటి నుంచి పులివెందులకు సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్సులో వస్తున్నారు. చక్రాయపేట సమీపంలోకి రాగానే శ్రీలత బస్సులో నుంచి దూకేసింది. కుమార్తె దూకడంతో వెంటనే తల్లి సులోచన కూడా దూకింది. ఈ ఘటనలో శ్రీలతకు తీవ్రగాయాలై ముక్కు, చెవులు, నోటి నుంచి రక్తస్రావమై స్పృహ కోల్పోయింది. హుటాహుటిన వేంపల్లెకు తరలించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. తల్లీ, కుమార్తెలు ఇరువురు బస్సు ఫుట్‌పాత్ డోర్‌కు ఎదురుగా ఉన్న సీటులో కూర్చున్నారు. ఉన్నపలంగా దూకడంతో ప్రయాణికులు ఒకింత భయాందోళనకు గురయ్యారు. అయితే ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వారసత్వ సంపదకు నిలయం కడప జిల్లా


నృత్యం చేసిన చిన్నారులతో ఇంటాక్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా భారత దేశ స్థాయిలో ఘనమైన వారసత్వ సంపదకు నిలయంగా ఉందని ఇంటాక్ సభ్యులు మంజులారెడ్డి, సంజీవరెడ్డి అన్నారు. సోమవారం కడప నగరం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటాక్ ఆధ్వర్యంలో వారసత్వ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు నృత్యం చిత్రకళ, యోగా చేనేతలు తదితర అంశాలతో పాటు వారసత్వ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటాక్ కన్వీనరు లయన్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ కేవలం శాస్త్రీయ జానపద నృత్యాలతో కార్యక్రమాన్ని ప్రసంగాలు లేకుండా ఏర్పాటు చేయడం విశేషమన్నారు. భరతనాట్యం, కూచిపూడి, అన్నమయ్య కీర్తనలు, కోలాటం, కర్రసాము, జానపద నృత్యాలు తదితర సాంప్రదాయ నృత్యాలు కళారూపాల ప్రదర్శనతో వారోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామన్నారు. నృత్యం చేసిన చిన్నారులకు లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకటసుబ్బయ్య కొండూరు జనార్థన రాజు, కొండారెడ్డి, గంగాధర్, గౌరీశంకర్, నాగవేణి తదితరులు బహుమతులు అందజేశారు.

అవినీతికి కేరాఫ్..!



- రిజిస్ట్రేషన్‌కు ఓ రేటు నిర్ణయించి పైసా వసూల్
- ప్రతి పనీ రైటర్ల కనుసన్నల్లోనే
- ఇదీ.. బద్వేలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం దుస్థితి

బద్వేలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఖజానాకు ఆదాయం తీసుకువచ్చే శాఖలలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ప్రధానమైనది. ఈ శాఖలో అవినీతి రాజ్యమేలుతోంది. కొంతమంది అధికారులు తాము ఇంతే.. తమ తీరు ఇంతే అన్నకోవలో సాగుతున్నారు. ప్రతి రిజిస్ట్రేషన్‌కు ఒక రేటు నిర్ణయించి పైసా వసూలు చేస్తున్నారు. ఇక్కడ డాక్యుమెంటు రైటర్లు చెప్పిందే వేదమన్నట్లుగా అవినీతి దందా సాగుతోంది. డాక్యుమెంటు రైటర్లతో అధికారులు ఒప్పందం కుదుర్చుకుని స్థిర, చరాస్తులు రిజిష్టర్ చేయించుకునేందుకు వచ్చేవారిని జలగల్లా పీక్కుతింటున్నారు. ఈ కార్యాలయంలో జరుగుతున్న అవినీతికి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.


బద్వేలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

బద్వేలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతి నిలయంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో పలుమార్లు ఏసీబీ అధికారులు దాడులు చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కొంతమంది అధికారులపై చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ అధికారుల్లో ఎలాంటి మార్పురాలేదని ప్రజల్లో గుసగుసలు వినవస్తున్నాయి. ప్రతి రిజిస్ట్రేషన్‌కు ఓ రేటు నిర్ణయించి పైసా వసూల్‌కు పాల్పడుతున్నా ఈ అవినీతికి అడ్డుకట్ట వేయలేక పోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం ద్వారా లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటూ ముడుపులు ఇస్తేగాని, రిజిష్టర్లు చేయని దుర్మార్గపు పరిస్థితి కనిపిస్తోంది. ఈ కార్యాలయంలో డాక్యుమెంటు రైటర్లు, కార్యాలయంలో పనిచేసే సిబ్బంది కనుసన్నల్లోనే సాగుతూ వస్తోంది. ఇక్కడ అవినీతి అధికారులకు అనేక ఫిర్యాదులు అందుతున్నట్లు సమాచారం. అందిన కాడికి వసూలు చేసుకోవడం ఇక్కడి అధికారుల వంతు అయిపోయిందని చెబుతున్నారు. అవినీతిలో మునిగి తేలుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు పేర్కొంటున్నారు. కార్యాలయంలో లంచం ఇవ్వనిదే ఏ పని జరగడం లేదన్న ఆరోపణలు బలంగా వినవస్తున్నాయి. ఇక్కడ డాక్యుమెంటు రైటర్లదే ఇష్టారాజ్యం, వారు చెప్పిందే వేదం, వారు అడిగినంత డబ్బులు ఇస్తేనే సాఫీగా రిజిస్ట్రేషన్ జరుగుతుంది. లేకుంటే రిజిష్టర్లు ఆపేస్తున్నారన్నట్లు తెలుస్తోంది. ఇక్కడ రైటర్లందరూ ఒక్కటిగా ఏర్పడి తమ దందాను కొనసాగిస్తున్నారు. ఏ పనికి ఎంతరేటో ముందుగానే చెప్పేస్తూ అందులో ఎవరి వాటా ఎంత అని నిర్ణయించి మరీ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇది బద్వేలు నియోజకవర్గ ప్రజలకు శాపంగా మారింది.

ఆరోపణలలో వాస్తవం లేదు

- విద్యాసాగర్‌రెడ్డి, సబ్ రిజిస్ట్రార్, బద్వేలు

ఆరోపణలలో వాస్తవం లేదు. ఎవరైనా లంచాలు అడిగినట్లు తమ దృష్టికి తెస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఫీజు చెల్లించి రశీదు చెల్లిస్తే రిజిష్టర్ చేస్తాం. నేను ఇటీవలే వచ్చాను. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల ప్రకారమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లు నా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం.

భారీ తేడాతో రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ విజయం

- 79 పరుగుల తేడాతో ప్రకాశం
- 4 వికెట్ల తేడాతో ఈస్ట్ గోదావరి జట్ల విజయాలు

కడప స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్- 23 మెన్స్ ఇంటర్ జోనల్ వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా సోమవారం వేర్వేరు జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. ఈ మ్యాచ్‌లలో రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టు 117 పరుగుల తేడాతో సెంట్రల్ జట్టుపై గెలుపొందగా, మరో మ్యాచ్‌లో ప్రకాశం జట్టు 79 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టుపై విజయం సాధించింది. అనంతపురం జట్టుపై ఈస్ట్ గోదావరి జట్టు 4 వికెట్ల తేడాతో గెలుపొందింది.

కేఓఆర్ఎం మైదానంలో

నగర కేఓఆర్ఎం మైదానంలో రెస్ట్ ఆఫ్ సెంట్రల్- రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో.. తొలుత టాస్ నెగ్గిన రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 323 పరుగులు చేసింది. ఇందులో సుబ్రమణ్యం (బ్యాటర్) 129 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. కాగా మరో బ్యాటర్ ధరణికుమార్‌నాయుడు 59 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్ జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 206 పరుగులకు కుప్పకూలింది. ఇందులో స్వామినాయుడు (బ్యాటర్) సరిగ్గా 100 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. బౌలింగ్ విభాగంలో ధరణికుమార్‌నాయుడు 5 వికెట్లు సాధించారు. దీంతో 117 పరుగుల భారీ తేడాతో రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టు విజయం సాధించింది.

ఏసీఏ క్రికెట్ మైదానంలో

నగర రిమ్స్ సమీప వై.ఎస్.రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్- ప్రకాశం జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 345 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో రోహిత్ (బ్యాటర్) 119 పరుగులు చేయగా మరో బ్యాట్స్‌మెన్ అభినవ్ 75 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు 48.5 ఓవర్లలో 266 పరుగులకే ఆలౌట్ అయింది. ఇందులో హిమకర్ (బ్యాటర్) 64 పరుగులు చేయగా మరో బ్యాటర్ రవికిరణ్ 65 పరుగులు చేశారు. దీంతో ప్రకాశం జట్టు 79 పరుగుల తేడాతో గెలుపు సాధించింది.


100 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన స్వామినాయుడు (రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్)

కేఎస్ఆర్ఎం మైదానంలో

నగర శివారు ప్రాంత కెఎస్ఆర్ఎం మైదానంలో ఈస్ట్ గోదావరి-అనంతపురం జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత టాస్‌నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 268 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు 47.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 271 పరుగులు మాత్రమే చేసింది. ఇందులో టి.వి.సాయిశ్రావణ్ 93 పరుగులు చేశారు. దీంతో ఈస్ట్ గోదావరి జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

ఓబీసీ కులగణన వెంటనే చేపట్టాలి

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు

కడప మారుతీనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యావత్ భారత దేశంలో జనగణనతో పాటుగా ఓబీసీ కులగణన త్వరగా పాలక ప్రభుత్వాలు చేపట్టాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఓబీసీ కులగణన చేట్టిన తర్వాతనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడాలని తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పాలక ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారన్నారు. ఆ మేరకు బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కమిటీ పిలుపు దృష్ట్యా సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్, ఉపాధ్యక్షుడు కళ్యాసుధాకర్ మాట్లాడారు. మన దేశానికి స్వాతంత్ర్యం రాకముందు 1931 సంవత్సరంలో మన దేశంలో గల అన్ని కులాల జనాభా వివరాలతో పాటుగా జీవన స్థితిగతులను సేకరించారన్నారు. తదుపరి ఇంతవరకూ జరిగిన ఏ జనగణనలోనూ, సమగ్ర కులగణన జరపక పోవడం విడ్డూరంగా వుందన్నారు. స్వతంత్ర భారతంలో 77 సంవత్సరాల తర్వాత కూడా అణగారిన వెనుకబడిన తరగతులైన ఓబీసీల జనగణన, కులాలవారిగా వివరాలను శాస్త్రీయంగా సేకరించక పోవడం బాధాకరమన్నారు. మనదేశంలో సుమారు 6,743 కులాలున్నాయని, అందులో 3,964 ఓబీసీ కులాలతో విభజితమై వుందన్నారు. కాగా మొత్తం జనాభాలో 52 శాతంగా వున్న ఓబీసీలకు రాజకీయ, ఆర్థిక, వాణిజ్య, విద్య, ఉద్యోగ, ఉపాధి, రంగాలలో మాత్రం వీరి వాటా 12 నుంచి 21 శాతానికి మించి లేవని పలు సర్వేలు చెబుతున్నాయన్నారు. ఆధిపత్య కుల ప్రాధాన్యత కలిగిన హర్యానా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలలో ఓబీసీ పార్లమెంట్ సభ్యులు ఏనాడు 12 నుంచి 30 శాతానికి మించడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి త్వరితగతిన ఓబీసీ కులగణన కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడు సీఆర్‌వి సునీల్ జయంత్, నాయకులు ఖాదర్‌బాష, మహిళా నాయకురాలు జయశ్రీతో పాటు పలువురు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు

వంద పుస్తకాలు బహూకరణ


బ్రౌన్ గ్రంథాలయానికి సమర్పించిన పుస్తకాలు

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి చెందిన విశ్రాంత జియాలజిస్ట్ జి.వెంకట్రామిరెడ్డి వంద పుస్తకాలను సోమవారం సీపీబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో గ్రంథాలయ సహాయకుడు ఎస్.రమేశ్‌రావుకు అందించారు. ఈ సందర్భంగా సంచాలకురాలు ప్రొఫెసరు పార్వతి మాట్లాడుతూ వెంకట్రామిరెడ్డి బహూకరించిన అమూల్యమైన గ్రంథాల్లో గాలిబ్ గీతాలు, సింహాచల వైభవం, మా పసలపూడి కథలు, భట్టిప్రోలు కథలు, తెలుగుకథ ఇలా అనేక గ్రంథాలున్నాయన్నారు. కాగా వెంకట్రామిరెడ్డిని వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ హర్షం వ్యక్తం చేశారు.

మట్కారామయ్య అరెస్టు

- రూ.50,130 నగదు, చీటీలు స్వాధీనం

కడప క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎర్రముక్కపల్లెలో మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు అమర్‌నాథరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు ఎర్రముక్కపల్లెకు చెందిన రామయ్య అలియాస్ మట్కారామయ్య మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. సీఐ రామక్రిష్ణ అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.50130 నగదు, మట్కాచీటీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

గోపవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీకాంత్ సోమవారం తెలిపారు. స్థానిక రూరల్ పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎటువంటి అనుమతులు లేకుండా పెద్దపోలు పల్లెకుంట తనిఖీ కేంద్రం నుంచి ఇసుకను తరలిస్తుండగా టిప్పరును స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేశామని, ఇసుక తరలింపుపై పోలీసుల నిఘా ఉందన్నారు. అదేవిధంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

ఎయిడ్స్ పట్ల అవగాహన ఉండాలి

కడప ఎన్జీఓఆర్‌సర్కిల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్షేత్రస్థాయిలో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని జిల్లా కుష్ఠ, క్షయ, ఎయిడ్స్ అధికారి డాక్టర్ రవిబాబు పేర్కొన్నారు. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ఎన్జీవోలు, సీబీవోలు, సభ్యులతో సమావేశం నిర్వహించారు.

గంగనపల్లె విద్యార్థుల ప్రతిభ

పెండ్లిమర్రి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో మండలంలోని గంగనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి దేవి తెలిపారు. వక్తృత్వ పోటీలలో ప్రథమస్థానంలో హజీరా నిలిచిందన్నారు. రాజ్యాంగంపై డిబేట్ నందు భవితరెడ్డి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు.

జీఎన్ఎస్ఎస్-1 ఈఈ గా ఉమామహేశ్వర్లు

కొండాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గాలేరు నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్-1) ఈఈ(ఎఫ్ఏసీ)గా ఉమామహేశ్వర్లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం జీఎన్ఎస్ఎస్ డీఈగా ఉన్న ఆయనకు ప్రమోషన్ రావడంతో ఎస్ఈగా కడప జీఎన్ఎస్ఎస్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు పనిచేసిన ఈఈ శ్రీనివాసులు సీఈగా ప్రమోషన్ పొందారు. కాగా గండికోట ప్రాజెక్టుతో పాటు పలు రిజర్వాయర్లు జీఎన్ఎస్ఎస్-1 పరిధిలోకి వస్తాయి.

బొలెరో వాహనాన్ని ఢీకొన్న లారీ

- డ్రైవరుకు గాయాలు

పులివెందులటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణం కడప రోడ్డులోని మెడికల్ కళాశాల సమీపంలో కోడిగుడ్ల బొలెరో వాహనాన్ని రేషన్ బియ్యం లారీ ఆదివారం రాత్రి ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలెరో డ్రైవరు ప్రసాద్ తలకు గాయాలయ్యాయి. బొలెరో వాహనం కడప నుంచి పులివెందులకు వస్తోంది. ఈ మేరకు ఎదురుగా వచ్చిన రేషన్ బియ్యం లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరు వాహనాల ముందు భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బొలెరో వాహనం డ్రైవరు ప్రసాద్‌కు కూడా గాయాలవడంతో చికిత్స నిమిత్తం దగ్గరలో ఉన్న వైఎస్ఆర్ సర్వజన ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసు నిందితుడు ఆత్మహత్యాయత్నం

- జిల్లా ఆసుపత్రిలో చికిత్స.. పోలీసుల పర్యవేక్షణ


చికిత్స పొందుతున్న హత్య కేసు నిందితుడు అనిల్‌కుమార్

మదనపల్లె అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓ హత్య కేసు నిందితుడు అనిల్‌కుమార్ పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం పోలీసుల పర్యవేక్షణలో జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ జగన్ కాలనీకి చెందిన స్వర్ణకుమారి సెప్టెంబరు 28న హత్యకు గురైంది. స్వర్ణకుమారి ధర్మవరం సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి. దుండగులు ఈమెను చంపి అయోధ్యనగర్ సమీపంలోని శ్మశానంలో పాతిపెట్టిన విషయం విదితమే. ఈ కేసులో ప్రధాన నిందితుడైన వెంకటేశ్‌ను అక్టోబరు 9న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్య కేసులో నలుగురు నిందితులు ఉండగా ఇప్పటికే ఇద్దరు రిమాండ్‌లో ఉండగానే మరో నిందితుడైన అనిల్‌కుమార్ ఇన్నాళ్లు ఎక్కడున్నాడో తెలీదు గానీ..ఆదివారం రాత్రి ఉన్నట్లుండి ములకలచెరువు టమోటా మార్కెట్‌లో అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నాడు. కోలుకోగానే నిందితుడు అనిల్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోనున్నారు. ఇదే కేసులో పరారీలో ఉన్న అనిల్‌కుమార్ తల్లిని కూడా పోలీసులు అరెస్టు చేయాల్సి ఉంది.

ఓం నమో భగవతే రుద్రాయ

● కార్తీక చివరి సోమవారం శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి ● ఆలయాల్లో రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక శోభ


పీటీఎం శివాలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం


నిమ్మనపల్లెలో స్వామివారికి బాహుదా నుంచి నీటిని తెస్తున్న వేదపండితులు


మదనపల్లె నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పెద్దతిప్పసముద్రం నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓం నమో భగవతే రుద్రాయ.. నమస్తే రుద్రమన్యవ అంటూ కార్తీక మాస నాల్గవ సోమవారం శైవ క్షేత్రాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో పరమశివుడికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకంతోపాటు విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు చేయడంతో ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. పీటీఎం మండలంలోని రంగసముద్రం, అంకిరెడ్డిపల్లె, పీటీఎం గ్రామాల్లో కార్తీమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో విశే షపూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక వేత్త ననగరం పట్టాబిరామయ్య ఆధ్వర్యంలో పీటీఎంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయం విశేష పూజలు నిర్వహించారు. పీటీఎం ఆలయంలో ఉదయం 8గంటల నుంచి స్వామి వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అలాగే రంగసముద్రంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయం, అంకిరెడ్డిపల్లెలో వెలసిన భైరవేశ్వరస్వామి ఆలయాల్లో విశేషపూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆయా ఆలయాల్లో కార్తీక దీపోత్సవ ం నిర్వహించారు. ఆయా ఆలయాల్లో భక్తులు అదిక సంఖ్యలో పాల్గొని స్వామి వార్లను దర్శించుకున్నారు.

నేలమల్లేశ్వరస్వామి కుంభాభిషేకం

నిమ్మనపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం అటవీ ప్రాంతం రుషిభూమిలో వెలసిన నేలమల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బాహుదా నది ప్రవాహం నుంచి వేద పండితులచే 101బిందెలతో నీళ్లను తీసుకువచ్చి స్వామివారిని అభిషేకించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు ధర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమాలను మదనపల్లి శ్రీకృష్ణ గ్రూప్ అధినేత మూర్పూరి శశిధర్‌రావు కుంటుంబ సభ్యులు నిర్వహించారు. ఆలయాని వచ్చి భక్తలకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఏవో మంజుల, తాత్కాలిక కమిటీ చైర్మన్ రామకృష్ణ తెలిపారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం

మదనపల్లెఅర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం నాలుగో సోమవారం మదనపల్లె పట్టణంలోని పలు ఆలయాల్లో కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చిప్పిలి గ్రామంలోని మడికయ్యల శివాలయంలో, దేవళంవీధిలోని సోమేశ్వరస్వామిఆలయంలో, నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరీ సర్కిల్‌లోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో, సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో శివుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. సాయంత్ర సంధ్యావేళ అన్ని ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. మంజునాథ స్వామి ఆలయంలో ఆలయకమిటీ, నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఆలయధర్మకర్త గుడిరామాంజులు, మడికయ్యల శివాలయంలో ఆలయప్రధాన అర్చకుడు విశ్వేశ్వరప్రసాద్, సోమేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఫణీంద్ర కుమార్‌లు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రతాలు

కలకడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):కార్తీక నాలుగవ సోమవారం పురస్కరించుకుని కలకడ సిద్దేశ్వర స్వామి వారి ఆలయంలో కేదారేశ్వర వ్రతాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గౌరమ్మకు పూజలు చేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం మహిళలు ఆలయంలో కార్తీక దీపాలను వెలిగించారు.

నిబంధనలు పాటించకుండా సెక్రటరీల బదిలీలు

● కలెక్టర్‌కు బహుజన యువసేన ఫిర్యాదు


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్

మదనపల్లె అర్బన్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో ఇటీవల నిర్వహించిన పంచాయతీ సెక్రటరీల బదిలీ ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలు పాటించలేదని అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు మదనపల్లె బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన కలెక్టర్ శ్రీధర్ చామకూరికి బహుజన యువసేన అధ్యక్షుడు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ గ్రేడ్ 4 వరకు పంచాయతీల సెక్రటరీలను స్థానికంగా నియమించడంగానీ, బదిలీలు చేయకూడదని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయన్నారు. అయితే అధికారులు వాటిని పాటించకుండా అంక్కిశెట్టిపల్లె పంచాయతీలో స్థానికురాలైన సెక్రటరిని బదిలీ చేశారని ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై పలుమార్లు డీపీవోకు, ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోలేదని వాపోయారు. కార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు శ్రీనివాసులు, నాగార్జున, సందాష్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న టమోటా ధరలు..కిలో రూ.56


మదనపల్లె మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన టమోటాలు

మదనపల్లె టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మార్కెట్‌యార్డులో టమోటాల ధరలు నిత్యం పెరుగుతూ వస్తున్నాయి. సోమవారం మదనపల్లె మార్కెట్‌కు కేవలం 166 మెట్రిక్ టన్నుల టమోటా మాత్రమే విక్రయానికి రావడంతో వ్యాపారుల మధ్య డిమాండ్ పెరిగి టమోటా ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. మార్కెట్‌లో మొదటి రకం టమోటా కిలో గరిష్ఠంగా రూ.56 పలుకగా, రెండో రకం టమోటా కనిష్ఠంగా కిలో రూ.32 ధర పలికింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా అనంత పురం, ఉత్తరాది రాష్ట్రాల్లో టమోటా దిగుబడి తగ్గిపోవడంతో వ్యాపారులు మదనపల్లె మార్కెట్‌వైపు వస్తున్నట్లు మండీ యజమానులు చెబుతున్నారు. మదనపల్లె మార్కెట్‌కు ఈ వారంలో సరాసరిన ప్రతి రోజు 250టన్నుల టమోటా విక్రయానికి వచ్చింది. కాగా ఒక్కసారిగా 90 టన్నులు తగ్గిపోవడంతో కూడా టమోటా ధరలు పెరగడానికి కారణంగా చెప్పవచ్చు.

స్థలవివాదంలో ఘర్షణ ఐదుగురికి గాయాలు

పెద్దతిప్పసముద్రం నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఓ స్థల వివాదంలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో 5మందికి గాయాలైన సంఘటన పెద్ద తిప్పసముద్రం మండలంలో చోటుచేసుకుంది. మడుమూరు గ్రామం మిట్టసోంపల్లెకు చెందిన బి. గురుమూర్తి ఇంటి పక్కనే కాపురమున్న టి, కరుణాకర్‌రెడ్డి ఆటో పెడుతుండగా అతనికి తగిలింది దీంతో గురుమూర్తి అతని భార్య రత్నమ్మలు కరుణాకర్‌రెడ్డిని ఆటో ఎందుకు తగిలించారని అడుగుతుండగా పాతకక్షలతో కరుణాకర్‌రెడ్డి తమ్ముడు మల్‌రెడ్డి, బావమరిది చౌరెడ్డి, అతని తల్లి మంగమ్మ, అల్లుడు సురేంద్రరెడ్డిలు మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ ఘటనలో గురుమూర్తి, రత్నమ్మ, శ్రీకాంత్, షంషూన్, గురులకు గాయాలయ్యాయి. వారిని బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఆటోలో నుంచి పడి వృద్ధుడికి...

కురబలకోట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆటోలో నుంచి పడి వృద్ధుడికి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. మండలంలోని కురబలకోటకు చెందిన గోపాల్‌రెడ్డి(75) అంగళ్ళుకు సొంతపనుల నిమిత్తం వచ్చి తిరిగి వెళుతుండగా ప్రమాదవశాత్తూ జారి కిందపడ్డాడు, ఈ ప్రమాదంలో క్షతగాత్రుడిని 108సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

మదనపల్లె అర్బన్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): కురబలకోట మండలం, తెట్టుగ్రామంకు చెందిన కిట్టన్న భార్య నాగసుబ్బమ్మ(65) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఆమెకు కన్ను ఆపరేషన్ చాలా కాలంగా కుటంబసభ్యులు చేయించలేదని మానుస్తాపానికి గురై ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే కుటుంబీకులు మదనపల్లె ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ముదివేడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. వృద్ధురాలు మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో శవ పరీక్షలు నిర్వహించి తెట్టుకు తరలించారు. ఆమెకు ముగ్గురు కుమార్తులు ఉన్నారు.

పిడుగు బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించండి

మదనపల్లె టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పొలంలో పనులు చేస్తున్న తన భార్యపై పిడుగు పడి మృతి చెందిన ఏడాదిన్నర అవుతున్నా ఇంత వరకు పరిహారం మంజూరు చేయలేదని బాధితుడు కె.కృష్ణమూర్తి గ్రీవెన్స్‌డేలో విన్నవించుకున్నాడు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి డీఏవో రాఘవేంద్ర ఆధ్వర్యంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని 11 మండలాల నుంచి పలు సమస్యలపై వచ్చిన ప్రజలు అర్జీలు అందజేశారు. వాటిలో ఎక్కువగా భూ వివాదాలు, పట్టాదారు పాసుపుస్తకాలు తదితర అంశాలతో ప్రజలు అర్జీలు అందజేశారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

పీలేరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):పంచాయతీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రామయ్య డిమాండ్ చేశారు. సోమవారం పీలేరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

రామసముద్రం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు సోమవారం రామసముద్రం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా పలు కేసులు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి సమాచారాన్ని ఎస్‌ఐ వెంకటసుబ్బయ్యను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులలో తనిఖీలు ముమ్మరం చేసి మద్యం, మాదకద్రవ్యాలు అక్రమ రవాణా కాకుండా చర్యలు చేపట్టాలని ఎస్‌ఐకు సూచించారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తాం


ఎస్‌ఐలతో సమీక్షిస్తున్న సీఐ లక్ష్మన్న

తంబళ్లపల్లె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తామని సీఐ లక్ష్మన్న తెలిపారు. సీఐగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆయన తంబళ్లపల్లె పోలీ స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు, పీటీఎం ఎస్‌ఐలతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసులు లోక్‌అదాలత్ ద్వారా పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా ఉంచి నేరాల నియంత్రణకు పూర్తి స్థాయిలో పనిచేయాలన్నారు. గ్రామాల్లో జూదం, కోడి పందేలపై నిఘా పెంచాలన్నారు. ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..ములకలచెరువు సర్కిల్ పరిధిలోని పోలీస్టేషన్లలో సిబ్బంది కొరత ఉందని..ఈ విషయాన్ని జిల్లా పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. తొందర్లోనే సర్కిల్‌కు పూర్తి స్థాయిలో సిబ్బంది రావడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు లోకేష్‌రెడ్డి, గాయత్రి, నరసింహుడు, కేవి రమణ, ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

పెద్దమండ్యం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలంలో ఈ నెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు విద్యార్థులకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తు న్నట్లు పెద్దమండ్యం ఎంపీడీవో శ్రీధర్‌రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 26న కలిచెర్ల చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్, 27వ తేదీన పెద్దమండ్యం హైస్కూల్, 28వ తేదీన సిద్దవరం కేజీబీవీ పాఠశాల, 29వ తేదీన కలిచెర్ల ఉర్దూ హైస్కూల్‌లో ఆధార్ ప్రత్యేక క్యాంపులు జరుగనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెల్లడించారు.

వలంటీర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మదనపల్లె టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వలంటీర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ వద్ద వలంటీర్లతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాటు కష్టపడి పనిచేసిన వలంటీర్లను తిరగి మళ్లీ విధుల్లో చేర్చుకోవాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామి మేరకు వలంటీర్లకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఫయాజ్, ఏఐటీయూసీ నాయకులు తిరుమల, వలంటీర్లు గౌతమి, సునంద, స్వర్ణ, స్వాతి, మురళి, చలపతిఇ, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా యాళి వాహన ఉత్సవం



వాల్మీకిపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూహాలయంలో వార్షికోత్సవ వేడుకలలో భాగంగా సోమవారం యాళి వాహనంపై వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామినగరోత్సవం నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాలలో భాగంగా షిరిడీ సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉదయం ఆలయంలో మూలవర్లకు అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక అలంకరణలతో పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం యాళి వాహనంపై వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి అలంకరణలు గావించి నగరోత్సవం నిర్వహించారు. చివరగా భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈకార్యక్రమాలలో ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంకు నూతన పాలకవర్గానికి సన్మానం


టౌన్‌బ్యాంకు నూతన పాలవర్గాన్ని అభినందిస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ది మదనపల్లె కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు నూతన పాల కవర్గంగా ఎన్నికైన చైర్మన్, డైరెక్టర్లకు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపి సన్మానించారు. సోమవారం స్థానిక టౌన్‌బ్యాంకు వద్ద చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, వైస్‌చైర్మన్ మహర్షి భాస్కర్‌తో పాటు 10 మంది డైరెక్టర్లను కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి పూలమాలలు వేసి అభినందించారు. అలాగే నియోజకవర్గ టీడీపీ సమన్వకర్త మార్పురి సుధాకర్ నాయుడు, టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్, న్యాయవాది గణపతి, కొత్తపల్లె మాజీ సర్పంచ్ గోపాల్ నాయుడు, ఎంపీటీసీ దేవేంద్ర తదితరులు నూతన పాలకవర్గానికి వేర్వేరుగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోయపాటి మురళి, ఆంజనేయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వెంటనే ఇంటిపట్టాలు ఇవ్వాలి


తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

బి.కొత్తకోట, నవంబరు 25: పేదలకు ఇంటి పట్టాలు, పక్కా గృహాలను మంజూరు చేయాలంటూ బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని పేదలు ప్రభుత్వాన్ని కోరారు. ఆమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వందలాది మంది పేదలు మహాధర్నా నిర్వహించారు. భారత కమ్యూనిస్ట్‌పార్టీ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రకమిటీల పిలుపు మేరకు ఆయా నాయకులు క్రిష్ణప్ప, మనోహర్‌రెడ్డిల నేతృత్వంలో కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఒకరోజు ముందుగా ఈ ధర్నాపై పట్టణంలో ప్రచారం నిర్వహించడంతో పెద్దఎత్తున పేదలు తరలివచ్చి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేదలను పట్టాల పేరుతో మోసం చేశారని, ఈ కూటమి ప్రభుత్వంలో అయినా పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు 500 అర్జీలను తహశీల్దార్ కార్యాల యంలో అందజేశారు. పట్టణప్రాంతంలో 1.5 సెంట్ల స్థలాన్ని ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కోసం యూనిట్‌వ్యయంతో పాటు, రూ.4 లక్షల రుణంగా ఇప్పిం చాలని తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బషీర్‌ఖాన్, రఘునాథ్, షమీవుల్లా, తంబయ్య, నారాణ స్వామి, బాబు, బావాజాన్, రామచంద్రలతో పాటు మహిళలు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలి

బి.కొత్తకోట, నవంబరు 25: బి.కొత్తకోట మండలంలో మంజూరైన గోకులం షెడ్లను త్వరితగతిన పూర్తి చేయాల ని క్లస్టర్ ఏపీడీ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కోటావూరు, గట్టు, బీరంగి పంచాయతీలలో నిర్మాణంలో వున్న షెడ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ షెడ్ నిర్మాణంలో నాణ్యతా ప్రమా ణాలు నిర్దేశించిన విధంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. షెడ్డు మంజూరు అయ్యి ఇంకా నిర్మాణం ప్రారంభించని వారి అనుమతులను రద్దు చేస్తామన్నారు. ఆయన వెంట ఏపీయం మంజుల సిబ్బంది వున్నారు.

దగ్గుబాటిని అభినందించిన ఎమ్మెల్యే నల్లారి


దగ్గుబాటికి సభ్యత్వ నమోదు కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లారి

కలకడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి దగ్గుబాటి వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి అభినందించారు. ఎమ్మెల్యే హైదరాబాదు నుంచి ఇంటికి వెళుతూ బాటవారిపల్లెలోని దగ్గుబాటి నివాసం వద్ద కొంత సమయం ఆగారు. ఈ సందర్భంగా లక్ష రూపాయలు చెల్లించిన సభ్యత్వ నమోదు కాపీని ఎమ్మెల్యే దగ్గుబాటికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఇంజేటి తారకేశ్వర, కుమార్ లాల్‌జీ, పునీత్ చౌదరి పాల్గొన్నారు.

నాటుసారా తయారీపై ఉక్కుపాదం

వాల్మీకిపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురంలో నాటు సారా తయారీ, విక్రయాలు సాగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ లత హెచ్చరించారు. సోమవారం వాల్మీకిపురం మండలంలోని దిగువ మేకలవారిపల్లెలో విస్తృత దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దాచిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, తయారీ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇకపై నాటుసారా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం దిశగా చర్యలు ఉంటాయన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏపీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఉద్యోగుల వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్

మదనపల్లె అర్బన్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం రాష్ట్రకమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళ వారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ పీఆర్సీ -22 విద్యుత్ కార్మికుల అరియర్స్ బకాయిలు చెల్లించాలని, కూటమి ప్రభుత్వంలో విద్యుత్ కార్మికులను రెగ్యులైజేషన్ చేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, డిస్కమ్‌లో, సబ్‌స్టేషన్స్‌లో వాచ్‌మెన్లను నియమించాలని డిమాండ్ చేశారు. విపత్తు పరిస్థితిలో విద్యుత్ కార్మికులు చేసిన సేవలను గుర్తించి వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యశ్వంత్, భాస్కర్, కళ్యాణ్‌కుమార్, నారాయణ, రియాజ్‌బాషా, రెడ్డెప్ప, మునివెంకోబారావు, వేణుగోపాల్, అస్లాంబాషా తదితరులు పాల్గొన్నారు.

ఇతరత్రా పనులు వీఆర్వోలకు అప్పగించకండి


పీలేరులో తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్వోలు

పీలేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖకు సంబంధించిన రెగ్యులర్ పనులను పూర్తి చేయలేక సతమత మవుతున్న తమకు ఇతరత్రా పనులు అప్పగించకుండా చూడాలని పీలేరు మండలంలోని వీఆర్వోలు ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు వీఆర్వోలు సోమవా రం స్థానిక తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ పనులతోనే తాము 24 గంటలూ అవిశ్రాంతంగా విధులు నిర్వర్తిస్తుండగా సంబంధం లేని పనులు అప్పగించడం భావ్యం కాదని తెలిపారు. స్కిల్ సెన్సెస్ సర్వే, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్‌లాంటి శాఖేతర పనులను నుంచి వీఆర్వోలను మినహాయించాలని కోరారు. మరీ ముఖ్యంగా గతంలో ఉన్న విధానాన్నే అమలు చేయాలని చెప్పారు. రెవెన్యూ శాఖలో వీఆర్వోలు గ్రామాల్లో గ్రామ కచేరీలు, చావడుల నుంచి విధులు నిర్వహించేవారమని తిరిగి అదే పద్ధతిని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. నిర్ధిత సమయ పాలన అమలు చేయాలన్నారు. అలాగే సోమవారం కేవీపల్లె తహశీల్దార్ క్రాంతికుమార్‌కు వీఆర్వోలు వినతి పత్రం అందజేశారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


సీఐని సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ములకలచెరువు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తంబళ్లపల్లె నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ప్రతాప్ కుమార్, ఎంఎస్పీ ఇన్‌చార్జి తిరుపాల్‌లు కోరారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవా రం ఇటీవల సీఐగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మన్నను నియోజకవర్గంలోని పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం, ముల కలచెరువు, తంబళ్లపల్లె మండలాలకు చెందిన నాయకులు కలిశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే దళితుల సమస్యల ను సకాలంతో పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఈశ్వరప్ప, సీనియర్ నాయకులు రామప్ప, రంగాళ్ళ సుధాకర్, తుడుము శ్రీనివాసులు, విజయ్‌కుమార్, నాయకులు తోపు రమణ, నరసింహులు, చంద్ర, రవి, రమణ, వెంకటరమణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో : ములకలచెరువు సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మన్నను తంబళ్లపల్లె కూటమి నాయకులు ఘనంగా సన్మానించారు. సోమవారం కూటమి నాయకులు తంబళ్లపల్లె పోలీస్టేషన్‌కు వెళ్లి సీఐను మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్దమ్మ, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి బేరిశీన, పురుషోత్తం, కాలా నారాయణ, తెలుగు యువత నరసింహులు, వెంకటరెడ్డి, నాగేంద్రనాయుడు, జగదీష్, వికలాంగుల మండలాధ్యక్షుడు రామాంజులు, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కురబలకోట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ యువరాజ్ పేర్కొన్నారు. మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం మహిళలపై జరుగుతున్న హింస నిర్మూలన కోసం అంతర్జాతీయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను నివారించడానికి అనేక చట్టాలను అమలు చేస్తున్నా కూడా సమాజంలో ఇంకా ఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని నివారించడానికి ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసు కురావాల న్నారు. కార్యక్రమంలో సాయిజ్ అహమ్మద్, రెడ్డి హేమంతా పాల్గొన్నారు.

గుర్రంకొండలో: జండర్ ఆధారిత హింసలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వెలుగు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సోమవారం కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీని నిర్వహించారు. అనంతరం బస్టాండులో మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. ఏపీ నాగశివారెడ్డి, ఏపీఎం రజనీకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించండి

గుర్రంకొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):రైతుల భూముల సమస్యలపై రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక చొరవచూపి పరిష్కరించాలని తహశీల్దార్ శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. సోమవారం వీఆర్వోలు, సర్వేయర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూ సమస్యలతో వచ్చే రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అలాగే రీసర్వే రాళ్లపై బొమ్మలను చెరిపి వేయడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంటర్ స్టేట్ కరాటే పోటీలలో పీలేరు విద్యార్థులకు చాంపియన్‌షిప్



పీలేరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పొద్దుటూరులో నిర్వహించిన ఇంటర్ స్టేట్ కరాటే పోటీలలో పీలేరుకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నారు. కరాటే కటాఫ్ పోటీలలో పీలేరు సాధన స్కూల్‌కు చెందిన మోక్షశ్రీ, సవ, వరజిన్‌లు విజేతలుగా నిలిచి బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. అలాగే కుమితే, నాన్‌చాక్ పోటీలలో భువన స్కూల్ నుంచి చరణ్, వీఎస్ఎన్ స్కూల్‌కు చెందిన ప్రవీణ్‌లు విజేతలుగా నిలిచి పతకాలు అందుకున్నారు. ప్రొద్దుటూరు విశ్రాంత సివిల్ జడ్జి ఇస్మాయిల్ చేతుల మీదుగా చాంపియన్‌షిప్ ట్రోఫీలు, బంగారు పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. మాస్టర్ దామోదర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.